ప్రేమతో మాట్లాడు
ఆలోచించి మాట్లాడు
అర్థం చేసుకొని మాట్లాడు
మంచి మాట్లాడు
తెలివిగా మాట్లాడు
నవ్వుతూ మాట్లాడు
మనస్సు విప్పి మాట్లాడు
పూర్తిగా విన్న తరువాత మాట్లాడు
మనస్సు నొప్పించకుండా మాట్లాడు
తక్కువ మాట్లాడు

TGTEL/25/A1132

మానవాళికి

# జనం వార్త

ప్రతి అక్షరం.. జనం కోసం..





'జనం వార్త'
మీ వ్యాపార, ఉద్యోగ, రాజకీయ, వివాహ, జన్మదిన తదితర ప్రకటనల కోసం సంప్రదించండి...
సెల్ : 8522 055 889



మేడ్చల్ | ఆదివారం | 12.07.2026 | సంపుటి : 2 | సంచిక : 11 | పేజీలు : 8 | వెల : 2/- | ఎడిటర్: దూసరి రవీందర్ గౌడ్




## గేట్లు మూస్తే..
# బ్యారేజీలకు ముప్పు

### కాళేశ్వరం నీళ్లు ఎత్తిపోయడం కుదరదు

మేడిగడ్డ గేట్లు ఎత్తే ఉంచాలని ఎన్‌డీఎస్‌ఏ ఆదేశాలు

ప్రజలను తప్పుదోవ పట్టించేలా ఈటెల వ్యాఖ్యలు

జలశక్తి మంత్రిత్వ శాఖను కలిసి అనుమతి తెస్తే అభ్యంతరం లేదు

ఈటెల, బిఆర్ఎస్ నేతలకే నిర్వహణ బాధ్యత అప్పగిస్తా

మీడియా సమావేశంలో సిఎం రేవంత్‌రెడ్డి స్పష్టీకరణ

హైదరాబాద్, జులై 11 : కాళేశ్వరం విషయంలో తమ ప్రభుత్వంపై ప్రతిపక్షాలు దుష్ప్రచారం చేస్తున్నాయని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వాన్ని దోషిగా నిలబెట్టాలని బీజేపీ నేతలు కుట్రలు చేస్తున్నారని దుయ్యబట్టారు. మాజీమంత్రి హరీశ్‌రావు సూచనల మేరకే ఎంపీ ఈటల రాజేందర్ మాట్లాడారని ఆరోపించారు. కాళేశ్వరంపై ఎంపీ ఈటల అవాస్తవాలు చెప్పారని ధ్వజమెత్తారు. ఎంపీ ఈటల అంటే తమకు గౌరవమేనని

మిగతా 2 లో

# ఉన్మాది నరమేదం




### షాబాద్ పరిధిలో కనీవినీ ఎరుగని దారుణం

### ఆరుగురుని దారుణంగా హత్య చేసిన సైకో

10

ఫోక్సో కేసు పెట్టారని ముగ్గురి హత్య

విచిత్రంగా భార్యా ఇద్దరు పిల్లల నరికివేత

అనంతరం గ్రామం నుంచి పరార్

నిందితుడి కోసం గాలిస్తున్న పోలీసులు

సైకోను పట్టుకోవాలంటూ గ్రామస్తుల ఆందోళన

రంగారెడ్డి జిల్లాలోని షాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఆరుగురు దారుణ హత్యకు గురైన ఘటన కలకలం సృష్టించింది. షాబాద్ మండల కేంద్రంలోని దైవాలగూడలో శుక్రవారం అర్ధరాత్రి ఈ ఘటన చోటుచేసుకుంది. పోక్సో కేసు పెట్టారనే కక్షతో రాజ్‌కుమార్ (28) ఘాతుకానికి ఒడిగట్టాడు. దైవాలగూడకు చెందిన పార్వతి రాజ్ కుమార్ కట్టుకున్న భార్య, ఇద్దరు కుమారులతో పాటు, తనపై పోక్సో కేసు పెట్టిన మైనర్ బాలిక, ఆమె తల్లి లక్ష్మీ, నాయనమ్మ రుక్కమ్మలను కత్తితో నరికి చంపాడు. మొదట షాబాద్ పీఆర్ ఆర్ స్టేడియం సమీపంలో ఉన్న మైనరు బాలిక (17)ఇంట్లోకి ప్రవేశించి.. ఆమెను బలవంతంగా లాక్కెళ్లే క్రమంలో బాలిక



తల్లి, నాయనమ్మ అడ్డు పడ్డారు. నిందితుడు వారిద్దరినీ కత్తితో పొడిచి చంపాడు. అనంతరం బాలికను దైవాల గూడ సమీపంలోని అఖిల్ సాగర్ చెరువు సమీపంలోకి తీసుకెళ్లి పీక కోసి హత్య చేశాడు. అనంతరం దైవాలగూడలోని తన ఇంటికొచ్చి భార్య సరిత (33)తో పాటు ఇద్దరు కుమారులు పరీక్షిత్ (4), దైవీక్షిత్ (2)లను కత్తితో పీకలు కోసి దారుణంగా హతమార్చాడు.

### నరహంతకుడిని పట్టుకోండి

పోలీస్ స్టేషన్ ముందు గ్రామస్థుల ధర్నా

ఎమ్మెల్యే కాలే యాదయ్యను నిలదీసిన ప్రజలు

03

ఎస్ఐ సస్పెన్షన్.. నిందితుడి ఆచూకీ కోసం 2లక్షల రివార్డు



భారత్-న్యూజిలాండ్ బంధం

# మరింత బలోపేతం

ఈ ప్రయాణం మున్ముందు మరింత విజయవంతమవుతుంది

ప్రవాస భారతీయులు కృషి ఇందుకు ప్రధాన కారణం

న్యూజిలాండ్ పర్యటనలో ప్రవాస భారతీయులతో మోడీ

ఆక్లాండ్, జులై 1 : భారత్–న్యూజిలాండ్ వాకా (బోటు) ఇప్పుడు నూతన ప్రయాణాన్ని ఆరంభించేందుకు సిద్ధంగా ఉందని, ఇరు దేశాల మధ్య భాగస్వామ్యం మరింత బలోపేతం కానుందని భారత ప్రధాని నరేంద్ర మోదీ ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ ప్రయాణం మున్ముందు మరింత విజయవంతమవుతుందనే పూర్తి నమ్మకం తనకుందన్న మోదీ.. అది తనవల్ల కాదని, అందుకు న్యూజిలాండ్‌లోని భారతీయులే కారణమన్నారు. న్యూజిలాండ్‌లో

- మిగతా 2 లో

## కాలం తెచ్చిన కరువు కాదు..
# కాంగ్రెస్ కరువు

గోదావరిలో నీళ్లు ఉన్నా ఉపయోగించుకోని దరిద్రం

కావాలనే నీటిని వృధాగా వదులుతున్నారు

మీడియా సమావేశంలో మరోమారు కెటిఆర్ విమర్శలు

హైదరాబాద్, జులై 11 : ఇది కాలం తెచ్చిన కరువు కాదు కాంగ్రెస్ తెచ్చిన కరువు అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆరోపించారు. తెలంగాణ భవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో కేటీఆర్ మాట్లాడుతూ.. 2022 వరదల ఫోటోలు చూపి కన్నెపల్లి మునిగిందని అడ్డమైన మాటలు మాట్లాడుతున్నారని మండిపడ్డారు. ఒకవైపు నీళ్లు లేక రైతులు ఏడుస్తుంటే.. రేవంత్ రెడ్డి ఏమో మా మీద కోపంతో నీళ్లు ఉన్నా కూడా ఇవ్వడం లేదని కేటీఆర్ మండిపడ్డారు. ఎల్‌నినో ప్రభావం వల్ల ఎక్కడా నీళ్లు లేకపోయినా కన్నెప ల్లిలో మాత్రం నీళ్లు ఉన్నాయని.. మేడిగడ్డను ముట్టకుండా కన్నెపల్లి నుండి అన్నారం, సుందిళ్ల, ఎల్లంపల్లి, మిడ్ మానేరు

-మిగతా 2 లో..





## ల్యాండ్ సెటిల్మెంట్లకు అడ్డాగా
# పోలీసు స్టేషన్లు

రాష్ట్రంలో శాంతిభద్రతలు పూర్తిగా దెబ్బతిన్నాయి

షాబాద్‌లో ఆరు హత్యలకు ప్రభుత్వ వైఫల్యమే కారణం

నైతిక బాధ్యత వహిస్తూ సీఎం రాజీనామా చేయాలి

: బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్‌రావు

సిద్దిపేట, జులై 11 : కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో రాష్ట్రంలో శాంతిభద్రతలు పూర్తిగా దెబ్బతిన్నాయని, పోలీసు స్టేషన్లు కేవలం ల్యాండ్ సెటిల్మెంట్లకు అడ్డాగా మారాయని మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్‌రావు మండిపడ్డారు. షాబాద్‌లో జరిగిన ఆరు హత్యలకు ప్రభుత్వ వైఫల్యమే కారణమన్నారు. దీనికి నైతిక బాధ్యత వహిస్తూ ముఖ్యమంత్రి వెంటనే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. సిద్ధిపేటలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో

-మిగతా 2 లో..

## బుల్లెట్ ట్రైన్స్ హబ్‌గా
# తెలంగాణ

### హైదరాబాద్, చెన్నై, బెంగళూరును కలుపుతూ కారిడార్

దేశంలో 7 బుల్లెట్ ట్రైన్లకు మూడు తెలంగాణకే

దేశ వ్యాప్తంగా 1,300 రైల్వే స్టేషన్ల ఆధునికీకరణ

ఇప్పటికే 260 రైల్వే స్టేషన్ల ఆధునికీకరణ పూర్తి

వికసిత్ భారత్-2047.. సాంకేతికత పాత్ర పై అశ్వినీ వైష్ణవ్

హైదరాబాద్,జులై 1 : తెలంగాణకు రైల్వే బడ్జెట్‌ను కేంద్రం భారీగా పెంచిందని కేంద్ర రైల్వేశాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్ తెలిపారు. తెలంగాణ బుల్లెట్ ట్రైన్స్ హబ్‌గా మారబోతోందని అన్నారు. హైదరాబాద్ హెచ్ఐసీసీలో వికసిత్ భారత్–2047.. సాంకేతికత పాత్ర' అనే అంశం నిర్వహించిన సదస్సులో కేంద్రమంత్రి కిషన్‌రెడ్డితో కలిసి అశ్వినీ వైష్ణవ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా రైల్వే మంత్రి మాట్లాడుతూ.. హైదరాబాద్, చెన్నై, బెంగళూరును కలుపుతూ బుల్లెట్ ట్రైన్లు రానున్నాయని తెలిపారు. యూపీఏ ప్రభుత్వం ఉమ్మడి ఏపీకి ఇచ్చిన రైల్వే బడ్జెట్ రూ. 880 కోట్లు మాత్రమే.. మోదీ సర్కార్ కేవలం తెలంగాణకే రూ. 5వేల కోట్లు ఖర్చు చేస్తోందన్నారు. సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌ను

-మిగతా 2 లో..





### నేటి చికెన్ ధరలు

| | |
|---|---|
| ఫారం ధర లైవ్ బర్డ్ | 150 (కిలో) |
| రిటైల్ లైవ్ బర్డ్ | 177 (కిలో) |
| డ్రెస్డ్ స్కిన్‌తో | 257 (కిలో) |
| స్కిన్ లెస్ | 292 (కిలో) |

12 గుడ్ల రిటైల్ ధర ₹74

## వియత్నాంలో
# ఘోర ప్రమాదం

పర్యాటక బోటు బోల్తా పడి 19మంది జలసమాధి

పలువురు పరిస్థితి విషమం..ఆస్పత్రిలో చికిత్స

విహార యాత్రకు వెళ్లిన తెలుగువాలో పలువురు మృతి

మృతుల్లో కడప, మచిలీపట్నంలంకు చెందిన వారు

రంగంలోకి దిగిన భారత ఎంబసీ..హెల్ప్‌లైన్ నంబర్లు ఏర్పాటు

04





# భారత్ లక్ష్యం యుద్ధం కాదు

భద్రతకు ముప్పు వాటిల్లినందునే ఆపరేషన్ సిందూర్

కేంద్ర రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ స్పష్టీకరణ

04

## 1000 క్షిపణులను
# లోడ్ చేసిపెట్టాం

నన్ను చంపాలనుకుంటే ఇరాన్ మటాష్

ఊహించని విధంగా అంతం చేస్తాం

ఇరాన్‌కు ట్రంప్ తీవ్ర హెచ్చరికలు



02



# భారత్-న్యూజిలాండ్ బంధం మరింత బలోపేతం

(మొదటిపేజీ తరువాయి)

భారత ప్రధాని నరేంద్ర మోదీ రెండో రోజు పర్యటన కొనసాగింది. శనివారం ఆక్లాండ్‌లో ఆయన ప్రవాస భారతీయులను ఉద్దేశించి ప్రసంగించారు. ఇరు దేశాల మధ్య సంబంధాలు స్నేహం, విశ్వాసం, విలువలు, బలమైన భవిష్యత్తు కోసం పరస్పర నిబద్ధతపై నిర్మితమయ్యా యని ఈ సందర్భంగా చెప్పుకొచ్చారు మోదీ. న్యూజిలాండ్ సంప్రదాయంలో విశిష్ట స్థానం కలిగిన 'వాకా'ను గురించి ప్రస్తావిస్తూ.. 'అదో పడవ మాత్రమే కాదని, ఉమ్మడి ప్రయాణానికి చిహ్నం' అని పేర్కొన్నారు. ఆక్లాండ్ నుంచి వెల్లింగ్టన్ వరకు, క్రైస్ట్‌చర్చ్ నుంచి క్వీన్స్‌టౌన్ వరకు విస్తరించి ఉన్న భారతీయ సమాజమే ఈ స్వర్ణయుగ ప్రయాణానికి నిజమైన నావికులని కొనియాడారు. భారతీయుల ప్రతిభను గుర్తించి సరైన అవకాశాలు కల్పించే అద్భుత దేశం న్యూజిలాండ్ అని అన్నారు. ఎయిర్ న్యూజిలాండ్ సీఈఓగా నిఖిల్ రవిశంకర్, గవర్నర్ జనరల్‌గా ఆనంద్ సత్యానంద్, క్రికెట్‌లో రచిన్ రవీంద్ర, ఇష్ సోధి, అజాజ్ పటేల్ వంటి భారత సంతతి వ్యక్తులు రాణించడమే ఇందుకు నిదర్శనమని చెప్పారు. అలాగే ఆ దేశంలోని పలు ప్రాంతాలకు బాంబే హిల్స్, కోరమాండల్, కలకత్తా స్ట్రీట్, ఢిల్లీ క్రెసెంట్, అమృత్‌సర్ స్ట్రీట్ వంటి భారతీయ పేర్లుండటాన్ని ఇరు దేశాల మధ్య ఉన్న అనుబంధానికి సంకేతమని పేర్కొన్నారు. ఈ దేశంతో తనకు 30 ఏళ్ల అనుబంధం ఉందని గుర్తుచేసిన మోదీ.. రాజకీయాల్లోకి రాకముందే న్యూజిలాండ్‌ను సందర్శించే అవకాశం వచ్చిందని చెప్పారు. నాడు ఓ న్యూజిలాండ్ వాసి తనకు మఫ్లర్, టోపీ, గ్లౌజులు కానుకగా ఇచ్చిన విషయాన్ని స్మరించుకున్నారు. ఆ మఫ్లర్‌ను ఇప్పటికీ జాగ్రత్తగా భద్రపరుచుకున్నానని, అందులో న్యూజిలాండ్ దేశీయుల ప్రేమనూ అంతే ఆప్యాయంగా కాపాడుకుంటున్నట్టు చెప్పుకొచ్చారు. ఈ సందర్భంగా ఆ దేశ ప్రధాని క్రిస్టోఫర్ లక్సన్ సహా ప్రభుత్వ ప్రతినిధులు, లేబర్ పార్టీ నాయకులకు మోదీ కృతజ్ఞతలు తెలిపారు. భారత్-న్యూజిలాండ్ బంధాలకు అక్కడి అన్ని రాజకీయ పార్టీలు మద్దతివ్వడం హర్షించదగ్గ విషయమన్నారు. ఇరు దేశాల మధ్య ద్వైపాక్షిక సంబంధాలను మరింత ఉన్నతస్థాయికి తీసుకెళ్లడంలో ఎన్ఆర్ఐల పాత్ర కీలకమని స్పష్టం చేశారు.

# మోడీ నేరుగా ప్రజలతోనే కనెక్ట్ అవుతారు

- మధ్యలో ఇతరుల జోక్యం కోరుకోరు
- మీడియాను దూరంగా పెట్టడంపై జర్నలిస్ట్ ప్రశ్న
- విదేశాంగ అధికారి రుద్రేంద్ర టాండన్ జవాబు

**ఆక్లాండ్,జులై 1 :** ప్రస్తుతం మూడు దేశాల పర్యటనలో భాగంగా న్యూజిలాండ్‌లో ఉన్న భారత ప్రధాని నరేంద్ర మోదీ పొలిటికల్ కమ్యూనికేషన్ స్టైల్‌పై అంతర్జాతీయ మీడియా నుంచి ఆసక్తికర ప్రశ్న ఎదురైంది. భారత రాయబార కార్యాలయ అధికారులతో జరిగిన ఓ ముఖాముఖి సమావేశంలో, ఓ స్థానిక జర్నలిస్ట్ నేరుగా దౌత్యవేత్తలను ఉద్దేశించి 'ప్రధాని మోదీ మీడియా సమావేశాలు ఎందుకు నిర్వహించరని ప్రశ్నించారు. దీనికి భారత విదేశాంగ మంత్రిత్వ శాఖ సీనియర్ అధికారి, ప్రముఖ దౌత్యవేత్త రుద్రేంద్ర టాండన్ అత్యంత చాకచక్యంగా స్పష్టమైన సమాధానమిచ్చారు. జర్నలిస్ట్ అడిగిన ప్రశ్నకు విదేశాంగ అధికారి రుద్రేంద్ర టాండన్ స్పందిస్తూ.. ప్రధాని రాజకీయ వ్యూహాలను ఒక ప్రభుత్వ అధికారిగా తాను ప్రశ్నించలేనని చెప్తూనే, భారతీయ రాజకీయాల నేపథ్యాన్ని వివరించారు. 'ప్రధాని మోదీ పక్కా భారతీయ రాజకీయవేత్త. సాధారణంగా భారతీయ నాయకులు తమ ఓటర్లతో నేరుగా సంబంధాలు కలిగి ఉండటానికే ఇష్టపడతారు. మధ్యవర్తులు లేదా మీడియా ద్వారా ప్రజలతో మాట్లాడటం కంటే, నేరుగా ప్రజలకే తమ సందేశాన్ని చేరవేయాలని భావిస్తారు' అని టాండన్ పేర్కొన్నారు. ప్రధాని మోదీ ఈ 'డైరెక్ట్ కాంటాక్ట్' విధానంలో అద్భుతమైన నైపుణ్యం సాధించారని, అందువల్లే ఆయన భారతదేశంలో అత్యధిక కాలం పనిచేసిన ప్రధానులలో ఒకరిగా నిలిచారని గుర్తుచేశారు. ప్రజలు ఆయన విధానాన్ని ఆదరించబట్టే వరుసగా మూడోసారి అధికారంలోకి వచ్చారని దౌత్యవేత్త స్పష్టం చేశారు. ప్రధాని మోదీ విదేశీ పర్యటనల్లో ఇలాంటి ప్రశ్నలు రావడం ఇదేం మొదటిసారి కాదు. గత మేలో నార్వే రాజధాని ఓస్లో పర్యటన సందర్భంగా కూడా అక్కడి ప్రధాని జోనాస్ గహర్ స్టోర్‌తో కలిసి మోదీ సంయుక్తంగా మీడియా ముందుకు వచ్చినప్పుడు. హెల్ లింగ్ అనే నార్వేజియన్ జర్నలిస్ట్ ప్రధాని మోదీని ఉద్దేశించి 'మీరు జర్నలిస్టుల ప్రశ్నలకు ఎందుకు సమాధానం ఇవ్వరు?' అని బహిరంగంగా అడిగారు. అప్పట్లో ఈ అంశం సోషల్ మీడియాలో పెద్ద చర్చకు దారితీసింది.



# ల్యాండ్ సెటిల్మెంట్లకు అడ్డాగా పోలీసు స్టేషన్లు

(మొదటిపేజీ తరువాయి)

శనివారం ఆయన మీడియా సమావేశంలో మాట్లాడారు. రాష్ట్రంలో జరిగిన ఆరు హత్యల ఉదంతం చాలా బాధాకరమన్నారు. ఆడపిల్లల తల్లిదండ్రులను ఈ ఘటన తీవ్ర ఆందోళనకు గురిచేసిందన్నారు. అత్యాచార నిందితుడిని అరెస్టు చేయడంలో పోలీసులు పూర్తిగా విఫలమయ్యారని, అతడికి బెయిల్ రావటానికి పోలీసులు, ప్రభుత్వం సహకరించిందని ఆరోపించారు. బెయిల్‌పై వచ్చి ఆరుగురిని హత్య చేయటం దారుణమన్నారు. నిందితుడి నుంచి తమకు ప్రాణహాని ఉందని బాధిత కుటుంబసభ్యులు చెప్పినా పట్టించుకోకపోవటంతోనే ఈ ఘటన జరిగిందన్నారు. నిందితుడిని అరెస్టు చేయటంలో కూడా పోలీసు వ్యవస్థ పూర్తిగా విఫలమైందన్నారు. హత్య జరిగిన సంఘటనాస్థలాన్ని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పరిశీలించకపోవటం దారుణమన్నారు. పోక్సో నిందితుడికి సహకారం అందిస్తారా? పరామర్శకు వెళ్లిన మాజీమంత్రులు సబితా ఇందారెడ్డి, సత్యవతి రాథోడ్, పద్మాదేవేంద్రరెడ్డిలను అరెస్టు చేస్తారా.. ఆరు హత్యలు జరిగితే బాధితులను పరామర్శించరా... అంటూ తీవ్రస్థాయిలో మండిపడ్డారు. ఈ సమావేశంలో భారాస సీనియర్ నాయకులు మారెడ్డి రవీందర్‌రెడ్డి, కొండం సంపత్‌రెడ్డి, కోల రమేశ్ గౌడ్ పాల్గొన్నారు.

# గేట్లు మూస్తే.. బ్యారేజీలకు ముప్పే

(మొదటిపేజీ తరువాయి)

పట్టించేలా బిఆర్ఎస్ నేతలు, ఎంపి ఈటెల చేస్తున్న ప్రకటనలు దారుణమని అన్నారు. డిప్యూటి సిఎం భట్టి విక్రమార్క, మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, పొన్నం ప్రభాకర్ కూడా మీడియా సమావేశంలో పాల్గొన్నారు. ఎన్‌డిఎస్ఎ ఇచ్చిన నివేదిక, ఆదేశాల మేరకు తాము నడుచుకుంటున్నామని స్పష్టం చేశారు. కేంద్రంలో పలుకుబడి ఉన్న బిజెపి ఎంపిగా ఈటెల రాజేందర్ జలశక్తి మంత్రిత్వ శాఖను కలిసి, ఎన్‌డిఎస్ఎ ఆధ్వర్యంలో కాళేశ్వరం నీటిని ఎత్తి పోస్తే తమకు అభ్యంతరం లేదని తేల్చి చెప్పారు. ఎన్‌డిఎస్‌ను కలసి నీటిని ఎత్తి పోసేందుకు అనుమతి తెస్తే అందుకు ప్రభుత్వానికి ఎలాంటి అభ్యంతరం ఉండబోదన్నారు. ఎన్‌డిఎస్ఎ ఆదేశాల మేరకు మేడిగడ్డ గేట్లు ఎత్తే ఉంచామని అన్నారు. మేడిగడ్డ గేట్లు మూస్తేనే కన్నెపల్లి వద్ద పంపులు నడపడానికి వీలుంటుంద న్నారు. అలా కాకుండా పారుతున్న నీటని ఎత్తిపోయడం సాధ్యం కాదన్నారు. ఇకపోతే పట్టిసీమ కోసం నీటిని వదులుతున్నామని చేస్తున్న ఆరోపణలపైనా సిఎం మండిపడ్డారు. పోలవరం పూర్తి చేసుకునే వరకు పట్టిసీమను కట్టుకున్న విషయం ఆనాటి మంత్రి హరీష్ రావుకు తెలియదా అన్నారు. కావాలనే బురదజల్లే ప్రయత్నాలు చేయడంపై మండిపడ్డారు. ఇప్పుడున్న పరిస్థితుల్లో నీటిని ఎత్తి ప ఓయడం కుదరదని సిఎం తేల్చారు. ఒకవేళ గేట్లు మూస్తే భద్రాచలం వరకు ముంపు తప్పదని ఎన్‌డిఎస్ఎ తెలిపిందని అన్నారు. కేసీఆర్ హయాంలో 2019 జూన్ 21వ తేదీన కాళేశ్వరం ప్రారంభించాక, కేసీఆర్ హయాంలోనే మేడిగడ్డ లోపాలు బయటపడ్డాయని సీఎం రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు.



ఈ ప్రాజెక్టు ప్రారంభించిన 11 నెలల్లోనే లోపాలు బయటపడ్డాయని చెప్పుకొచ్చారు. మేడిగడ్డ బ్యారేజ్ నిర్మాణంలో లోపాలు ఉన్నాయని.. 2020 మే 18వ తేదీన ఈఈ రమణారెడ్డి కేసీఆర్ ప్రభుత్వానికి లేఖ రాశారని ప్రస్తావించారు. లోపాలు సవరించాలని అప్పట్లోనే ఇంజినీర్లు సూచించారని అన్నారు. బీఆర్ఎస్ హయాంలో నిర్లక్ష్యంతో లోపాలు పెరిగి పెద్దవై బ్యారేజ్ కుప్పకూలిందన్నారు. 2022 జులై 14వ తేదీన వరదలకు కన్నెపల్లి పంప్‌హౌస్ దెబ్బతిందని చెప్పారు. ఇప్పటికీ కన్నెపల్లి పంప్‌హౌస్ వినియోగంలోకి రాలేదని తెలిపారు. 2023 అక్టోబర్ 21వ తేదీన మేడిగడ్డ బ్యారేజ్ కుంగిపోయిందని ప్రస్తావించారు. మేడిగడ్డ బ్యారేజ్ కుంగుబాటుపై.. కేసీఆర్ సీఎంగా ఉన్నప్పుడే ఎన్డీఎస్ఏ కమిటీ ఏర్పాటు చేసిందని సీఎం రేవంత్‌రెడ్డి గుర్తుచేశారు. మేడిగడ్డ, సుందిళ్ల, అన్నారం బ్యారేజీలు నీటి నిల్వకు అనుకూలం కావని ఎన్డీఎస్ఏ తేల్చిచెప్పిందని అన్నారు. ప్లానింగ్, డిజైనింగ్, నిర్మాణం, నిర్వహణ లోపాలపై.. గతంలోనే ఎన్డీఎస్ఏ కమిటీ నివేదిక ఇచ్చిందని ప్రస్తావించారు. ప్రాథమిక, తుది నివేదికల్లో ఎన్డీఎస్ఏ అదే విషయం చెప్పిందని అన్నారు. లోపాలు సవరించాలని నిపుణులు చెప్పినా ఎం దుకు పట్టించుకోలేదని ప్రశ్నించారు. మొదట్లోనే స్పందించకపోవడంతో ఈ సమస్య పెద్దది అయిందని చెప్పుకొచ్చారు. బీఆర్ఎస్ నేతలు కేసీఆర్, హరీశ్‌రావు తమ ప్రభుత్వంపై పదేపదే అబద్ధాలు ప్రచారం చేస్తున్నారని సీఎం రేవంత్‌రెడ్డి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.

# బుల్లెట్ ట్రైన్స్ హబ్‌గా తెలంగాణ

(మొదటిపేజీ తరువాయి)



ఆధునికంగా అభివృద్ధి చేస్తున్నామని తెలిపారు. దేశ వ్యాప్తంగా 1,300 రైల్వే స్టేషన్ల ఆధునికీకరణ పనులు చేపట్టామని వివరించారు. ఇప్పటికే 260 రైల్వే స్టేషన్ల ఆధునికీకరణ పూర్తయ్యిందని అశ్వినీ వైష్ణవ్ తెలిపారు. ఇందులో భాగంగా తెలంగాణలో 40 రైల్వే స్టేషన్ల ఆధునికీకరణకు నిధులు ఇచ్చామన్నారు. దేశంలో 7 బుల్లెట్ ట్రైన్స్ ప్రకటిస్తే.. అందులో తెలంగాణకు 3 దక్కాయని అశ్వినీ వైష్ణవ్ తెలిపారు. ప్రధాని నరేంద్ర మోదీ కారణంగానే తెలంగాణకు మూడు బుల్లెట్ ట్రైన్స్ దక్కాయని వెల్లడించారు. ఇవి అందుబాటులోకి వస్తే.. హైదరాబాద్ నుంచి విజయవాడకు కేవలం 1 గంట 10 నిమిషాలు.. హైదరాబాద్ నుంచి ముంబైకి 2 గంటల 20 నిమిషాలు.. హైదరాబాద్ నుంచి చెన్నయ్‌కి రెండు గంటల్లో వెళ్లవచ్చని చెప్పారు. ఈ ప్రాజెక్ట్ దేశంలో పెద్ద మార్పునకు శ్రీకారం చుట్టబోతోంది. కొంతమంది దీని క్రెడిట్ తీసుకునే ప్రయత్నం చేస్తున్నారు. ఈ క్రెడిట్ కేవలం నరేంద్ర మోదీకి మాత్రమే దక్కుతుందని అన్నారు. 'వికసిత్ భారత్-2047' లక్ష్య సాధనలో సాంకేతికత కీలక పాత్ర పోషిస్తుందని అశ్విని వైష్ణవ్ అన్నారు. వందేభారత్ రైళ్లు ప్రపంచస్థాయి సాంకేతిక ప్రమాణాలతో రూపొందించబడ్డాయని అశ్విని వైష్ణవ్ పేర్కొన్నారు. తెలంగాణకు ఇప్పటికే ఐదు వందేభారత్ రైళ్లు అందుబాటులోకి వచ్చాయని, త్వరలో మరిన్ని సేవలు ప్రారంభమవుతాయని చెప్పారు. గత 12 ఏళ్లలో దేశవ్యాప్తంగా 36,000 కి.మీ. కొత్త రైల్వే ట్రాక్‌లు నిర్మించామని తెలిపారు. అలాగే 2,700 కి.మీ. డెడికేటెడ్ ÷-రెట్ కారిడార్ పూర్తి చేసినట్లు వెల్లడించారు. దేశంలోని రైల్వే నెట్‌వర్క్‌లో 99.4శాతం విద్యుద్దీకరణ పూర్తయిందని, దీంతో డీజిల్‌పై ఆధారపడటం దాదాపు పూర్తిగా తగ్గిపోయిందని చెప్పారు. తెలంగాణకు ఇప్పటికే ఐదు వందేభారత్ రైళ్లు అందుబాటులోకి వచ్చాయని, త్వరలో మరిన్ని సేవలు ప్రారంభమవుతాయని చెప్పారు.

# ఎలక్ట్రానిక్స్, ఐటీ, చిప్ డిజైన్ రంగాల్లో ముందంజ

**సెమీ కండక్టర్ రంగంలో నైపుణ్యాలకు కొరత**
**యువత ఈ అవకాశాలు అందిపుచ్చుకోవాలి**
**కేంద్రమంత్రి అశ్విని వైష్ణవ్ వెల్లడి**

**హైదరాబాద్,జులై 1 :** ప్రపంచవ్యాప్తంగా సెమీకండక్టర్ పరిశ్రమలో దాదాపు 10 లక్షల మంది నైపుణ్యం కలిగిన ఉద్యోగుల కొరత ఉందని కేంద్రమంత్రి అశ్విని వైష్ణవ్ తెలిపారు. ఈ అవకాశాన్ని భారత్ సద్వినియోగం చేసుకోవాలని ఆయన పిలుపునిచ్చారు. దేశానికి ఎలక్ట్రానిక్స్, ఐటీ, చిప్ డిజైన్ రంగాల్లో ఇప్పటికే బలమైన పునాది ఉందని చెప్పారు. హైదరాబాద్‌లో నిర్వహించిన 'ఇండస్ట్రీ లీడర్ టౌన్ హాల్' సమావేశంలో కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి. కిషన్ రెడ్డి, బీజేపీ తెలంగాణ అధ్యక్షుడు రామచందర్ రావుతో కలిసి ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా దేశంలో ఎలక్ట్రానిక్స్, సెమీకండక్టర్, బుల్లెట్ ట్రైన్, రైల్వే ఆధునికీకరణ వంటి రంగాల్లో జరుగుతున్న మార్పులను వివరించారు. విద్యార్థులకు సెమీకండక్టర్ డిజైన్‌లో ప్రోత్సాహం అందించేందుకు సైనాప్సిస్, క్యాడెన్స్ వంటి అత్యాధునిక ఏఐ టూల్స్‌ను 315 విశ్వవిద్యాలయాలకు ఉచితంగా అందించినట్లు వెల్లడించారు. విద్యార్థులు స్వయంగా చిప్‌లను డిజైన్ చేసి, మొహాలీలోని సెమీకండక్టర్ ల్యాబ్‌లో వాటిని తయారు చేసి పరీక్షించే అవకాశం కల్పిస్తున్నామని చెప్పారు. ప్రపంచంలో చాలా కొద్ది విశ్వవిద్యాలయాలకే ఇలాంటి సదుపాయాలు ఉన్నాయని అన్నారు. దేశంలోని ఎలక్ట్రానిక్స్ తయారీ రంగం రెండంకెల వృద్ధిరేటుతో దూసుకెళ్తోందని అశ్విని వైష్ణవ్ తెలిపారు. ప్రస్తుతం ఈ పరిశ్రమ విలువ రూ.13 లక్షల కోట్లకు చేరుకుందని, త్వరలోనే రూ.20 లక్షల కోట్లకు పెరుగుతుందని చెప్పారు. ఈ రంగం ద్వారా ఇప్పటికే 25 లక్షల మందికి ఉపాధి లభిస్తోందని వెల్లడించారు. ఈ మధ్య భారత్ నుంచి అత్యధికంగా ఎగుమతి అయ్యే వస్తువుల్లో మొబైల్ ఫోన్లు అగ్రస్థానంలో నిలిచాయని, ఒకప్పుడు పెట్రోలియం, జెమ్స్ అండ్ జ్యువెలరీ ఆధిపత్యం ఉన్నా ఇప్పుడు ఎలక్ట్రానిక్స్ రంగం వాటిని అధిగమించిందని తెలిపారు. తెలంగాణలో ప్రస్తుతం 104 ఎలక్ట్రానిక్స్ తయారీ సంస్థలు పనిచేస్తున్నాయని అశ్విని వైష్ణవ్ తెలిపారు. కేంద్ర ప్రభుత్వం 4 భారీ ఎలక్ట్రానిక్స్ క్లస్టర్లను మంజూరు చేసిందని చెప్పారు. హైదరాబాద్‌లో హార్డ్‌వేర్ ప్రోటోటైప్ డిజైన్, టెస్టింగ్, వ్యాలిడేషన్ కోసం కామన్ ఫెసిలిటీ సెంటర్‌ను కూడా ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. దేశంలో తొలి బుల్లెట్ ట్రైన్ ప్రాజెక్టు ముంబై-అహ్మదాబాద్ మధ్య వేగంగా నిర్మాణంలో ఉందని.. 2027లో తొలి దశ సేవలు ప్రారంభమవుతాయని అశ్విని వైష్ణవ్ తెలిపారు. ఇదే అనుభవంతో దేశంలో మరో ఏడు బుల్లెట్ ట్రైన్ కారిడార్లకు ఆమోదం లభించిందని తెలిపారు. దేశంలో ప్రస్తుతం అభివృద్ధి, పనితీరు ఆధారిత రాజకీయాలే నడుస్తున్నాయని అశ్విని వైష్ణవ్ అన్నారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ విజన్‌తోనే బుల్లెట్ ట్రైన్లు, సెమీకండక్టర్లు, ఎలక్ట్రానిక్స్ తయారీ, ఆధునిక రైల్వే వ్యవస్థ వంటి కీలక రంగాల్లో భారత్ ప్రపంచస్థాయికి చేరుకుంటోందని పేర్కొన్నారు. 2047 నాటికి అభివృద్ధి చెందిన దేశంగా భారత్‌ను తీర్చిదిద్దే లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం ముందుకు సాగుతోందని ఆయన స్పష్టం చేశారు.

# ఘజియాబాద్‌లో అమానుష ఘటన

## ఏడేళ్ల చిన్నారిపై హత్యాచారం.. నిర్మాణంలో ఉన్న భవనంలో శవం లభ్యం

**లక్నో, జులై 11 :** ఉత్తర్‌ప్రదేశ్‌లోని ఘజియాబాద్‌లో అమానుష ఘటన చోటుచేసుకుంది. నిర్మాణంలో ఉన్న ఓ షాపింగ్ మాల్ బేస్‌మెంట్‌లో ఏడేళ్ల చిన్నారి మృతదేహం తీవ్ర కలకలం రేపింది. పోస్టుమార్టం నివేదికలో బాలికపై హత్యాచారం జరిగినట్లు నిర్ధారణ కావడంతో స్థానికుల్లో తీవ్ర ఆగ్రహావేశాలు వ్యక్తమవుతున్నాయి. ఈ ఘటన రాజ్‌నగర్ ఎక్స్‌టెన్షన్ ప్రాంతంలోని నంద్‌గ్రామ్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. బాధిత చిన్నారి తల్లిదండ్రులు అదే నిర్మాణ స్థలంలో కూలీలుగా పనిచేస్తూ అక్కడే ఓ గుడిసెలో నివసిస్తున్నారు. చిన్నారి శుక్రవారం సాయంత్రం నుంచి కనిపించకుండా పోయింది. కుటుంబ సభ్యులు రాత్రంతా గాలించినప్పటికీ ఆచూకీ లభించలేదు. శనివారం తెల్లవారుజామున నిర్మాణంలో ఉన్న ఆ మాల్ బేస్‌మెంట్‌లో చిన్నారి మృతదేహాన్ని గుర్తించారు. దీంతో బాధిత కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా రోదించారు. మృతదేహంపై తీవ్రగాయాలు ఉండటం, పలు ఎముకలు విరిగిన ఆనవాళ్లు కనిపించడంతో వెంటనే నంద్‌గ్రామ్ పోలీసులకు సమాచారం అందించారు. హుటాహుటిన ఘటనాస్థలికి చేరుకుని బాలిక మృతదేహాన్ని పోలీసులు పరిశీలించారు. అనంతరం పోస్టుమార్టం నిమిత్తం చిన్నారి మృతదేహాన్ని ఆస్పత్రికి తరలించారు. చిన్నారిని మాల్ మూడో అంతస్తు నుంచి కిందకు తోసేసి ఉండొచ్చని ప్రాథమిక విచారణలో భాగంగా అనుమానిస్తున్నారు. అయితే ఘటన ఎలా జరిగిందనే దానిపై ఇంకా స్పష్టత రాలేదు. మరోవైపు ఫోరెన్సిక్ బృందం రంగంలోకి దిగి ఆధారాలు సేకరిస్తోంది. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు అత్యాచారం, హత్య, అపహరణ, పోక్సో చట్టంలోని సంబంధిత సెక్షన్ల కింద కేసులు నమోదు చేశారు. ఇప్పటివరకు నలుగురు నుంచి ఐదుగురు అనుమానితులను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. మరో ఇద్దరు పరారీలో ఉన్నట్లు సమాచారం. ఘటనాస్థలం పరిసరాల్లోని సీసీటీవీ ఫుటేజీని పరిశీలిస్తూ నిందితుల కదలికలను గుర్తించే ప్రయత్నం చేస్తున్నారు. కాగా, చిన్నారి మృతదేహం లభించిన వార్తతో స్థానికులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. నిర్మాణ స్థలంలో విధులు నిర్వహిస్తున్న ఓ భద్రతా సిబ్బందిపై దాడికి ప్రయత్నించగా.. పరిస్థితిని అదుపులోకి తెచ్చేందుకు అదనపు పోలీసు బలగాలు మోహరించారు. ప్రస్తుతం ఫోరెన్సిక్ ఆధారాలు, సీసీటీవీ దృశ్యాలు, అనుమానితుల



# కాలం తెచ్చిన కరువు కాదు.. కాంగ్రెస్ కరువు

(మొదటిపేజీ తరువాయి)

అన్ని జలాశయాలు నింపొచ్చునని కేటీఆర్ వివరించారు. రిటైర్డ్ ఇంజనీర్ల నివేదిక చూసి అయినా సోయి తెచ్చుకో రేవంత్ రెడ్డి అని కేటీఆర్ హితవు పలికారు. మేడిగడ్డ గేట్లు మూసివేయకుండానే కన్నెపల్లి పంప్ హౌస్ నుండి నీళ్లు లిఫ్ట్ చేయవచ్చు అని రిటైర్డ్ ఇంజనీర్ల ఫోరం ప్రభుత్వానికి లేఖ రాసింది. కన్నెపల్లి వద్ద ప్రస్తుతం 96.79 మీటర్ల నీళ్లు ప్రవహిస్తున్నాయి, కానీ 94 మీటర్లకే పంపులు ఆన్ చేయవచ్చు. మరో 100 రోజులు కన్నెపల్లి వద్ద ఇదే తరహా ప్రవాహం ఉంటుంది. 100 రోజుల్లో రోజుకి 2 టీఎంసీల చొప్పున 200 టీఎంసీల లిఫ్ట్ చేస్తే, గోదావరి బేసిన్లో ఉన్న అన్ని రిజర్వాయర్లు నింపి సస్యశ్యామలం చేసే అవకాశం ఉందని ప్రభుత్వానికి రిటైర్డ్ ఇంజనీర్ల ఫోరం ప్రభుత్వానికి లేఖ రాసిందన్నారు. మా మీద కక్షతో రైతుల నోట్లో మట్టి కొట్టకు.. కాళేశ్వరం ప్రాజెక్టును బద్నాం చేసే కుట్రలో రైతులకు నీళు ఇవ్వకుండా వాళ్లని ఆగం చేయకు రేవంత్ రెడ్డి అని కేటీఆర్ కోరారు. గోదావరిలో కళ్ల ముందు లక్ష క్యూసెక్కుల నీళ్లు వరదలాగా కిందకి పోతుంటే అక్కడ ఎత్తిపోయడానికి నీళ్లు లేవు అన్నవాడు బుర్రతక్కువ వాడా..? లేదా రైతుల కోసం ఈ పని చేయమన్నోడు బుర్రతక్కువ వాడా..? అని కేటీఆర్ అన్నారు. కన్నెపల్లి వద్ద 93 మీటర్ల నుండే నీళ్లు ఎత్తిపోసే అవకాశం ఉంటే.. రాజకీయ ద్వేషంతో కళ్లు మూసుకున్న రేవంత్ రెడ్డి బుర్రతక్కువ వాడివో కాదో చెప్పాలన్నారు. అలాగే మేడిగడ్డ వద్ద 97 మీటర్ల ఎత్తులో నీళ్లు పోతుంటే కళ్లు ఉండి చూడలేని నువ్వు బుర్రతక్కువ వాడివా.. లేదా వాస్తవాలు చూపించే మేము తెలివి లేనివాళ్లమో చెప్పాలని డిమాండ్ చేశారు. పోలవరం వల్ల మునిగే భద్రాచలాన్ని పట్టుకొని మేడిగడ్డ వల్ల మునిగిపోతుంది అంటున్న నీకు బుర్రలేదు.. అంటూ మండిపడ్డారు. రైతాంగం మొత్తం కన్నెపల్లి నుండి నీళ్లు ఇవ్వమంటే పట్టించుకోని వాడిని బుర్రతక్కువ వాడు అనాలా లుచ్చా అనాలా..? అని కేటీఆర్ ఫైర్ అయ్యారు. గురువు కోసం నీళ్లు కిందకి వదులుతున్నావా..? అని రైతులు అడిగితే దానికి సమాధానం చెప్పే దమ్ము లేని దద్దమ్మ అనాలా, దరిద్రుడు అనాలా, ఏమనాలో చెప్పాలని కేటీఆర్ అడిగారు.



# సిఎం రేవంత్‌తో ఎమిరేట్స్ ప్రతినిధుల భేటీ

## విమాన సర్వీసులను పెంచాలని కోరిన సిఎం

**హైదరాబాద్,జులై 1 :** తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని ఎమిరైట్స్ వైమానిక సంస్థ ఇండియా వైస్ ప్రెసిడెంట్ మహమ్మద్ సార్ధన్ శనివారం సచివాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పలు కీలక అంశాలపై సీఎంతో చర్చించారు. ఎమిరైట్స్ వైమానిక సంస్థ 25 వసంతాలు పూర్తి చేసుకుంటున్న సందర్భంగా సీఎంను మర్యాదపూర్వకంగా ఎమిరైట్స్ ఇండియా వైస్ ప్రెసిడెంట్ కలిశారు. హైదరాబాద్‌లో ఎమిరైట్స్‌ఎ-38 సర్వీసులను ప్రారంభించేందుకు ఈ సంస్థ వైస్ ప్రెసిడెంట్ సుముఖత వ్యక్తం చేశారు. ఎమిరైట్స్ విమాన సర్వీసులను మరిన్ని పెంచాలని సీఎం రేవంత్‌రెడ్డి కోరారు. తెలంగాణలో మరో రెండు కొత్త విమానాశ్రయాలు ఏర్పాటు కాబోతున్న నేపథ్యంలో అక్కడ కూడా ఎమిరైట్స్ ఆపరేషన్స్ కొనసాగించాలని సీఎం సూచించారు. విమాన సర్వీసులకు కావాల్సిన అన్నిరకాల సౌకర్యాలు కల్పించేందుకు తమ ప్రభుత్వం సిద్ధంగా ఉందని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. గచ్చిబౌలి స్పోర్ట్స్ యూనివర్శిటీలో క్రీడాకారులకు శిక్షణ అందించేందుకు స్పాన్సర్‌షిప్‌నకు ముందుకు రావాలని సీఎం కోరారు. ఈ విషయంపై ఎమిరైట్స్ సంస్థ వైస్ ప్రెసిడెంట్ సానుకూలంగా స్పందించారు.

# సెమీకండక్టర్ రంగంలో మరో కీలక ముందడుగు

- హైదరాబాద్‌లో తొలి సీఎంపీ ప్యాడ్ టెక్నాలజీ హబ్
- టీ-వర్క్స్‌లో హబ్‌ను ప్రారంభించిన మంత్రి శ్రీధర్‌బాబు



**హైదరాబాద్, జులై 11 :** సెమికండక్టర్ రంగంలో తెలంగాణ రాష్ట్రం మరో కీలక ముందడుగు వేసింది. దేశంలోనే తొలి సీఎంపీ కెమికల్ మెకానికల్ పాలిషింగ్ ప్యాడ్ టెక్నాలజీ హబ్ హైదరాబాద్‌లో ప్రారంభమైంది. టీ-వర్క్స్‌లో ఏర్పాటు చేసిన ఈ హబ్‌ను రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్‌బాబు శనివారం ప్రారంభించారు. జపాన్‌కు చెందిన తోహో కోకి సంస్థ సాంకేతిక సహకారంతో ఈ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. రాష్ట్రాన్ని దేశంలోని ప్రముఖ సెమికండక్టర్ హబ్‌గా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని ఆయన చెప్పుకొచ్చారు. జపాన్‌తో భాగస్వామ్యాన్ని మరింత బలోపేతం చేస్తూ అత్యాధునిక సెమికండక్టర్ టెక్నాలజీ అభివృద్ధికి ఈ హబ్ వేదికగా నిలుస్తుందని మంత్రి ఆశాభావం వ్యక్తం చేశారు. చిప్ తయారీ పక్రియలో అత్యంత కీలకమైన సీఎంపీ ప్యాడ్ టెక్నాలజీ ఇకపై హైదరాబాద్‌లో అందుబాటులోకి రావడంతో దేశీయ సెమికండక్టర్ పరిశ్రమకు ఊతం లభించనుంది. ఈ హబ్ ద్వారా విద్యార్థులు, స్టార్టప్‌లు, పరిశోధకులకు అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంపై శిక్షణతో పాటు పరిశోధన, ఉత్పత్తి అభివృద్ధికి అవసరమైన సహకారం అందించనున్నారు. ఈ సందర్భంగా వచ్చే 18 నుంచి 24 నెలల్లో దేశీయంగా సీఎంపీ ప్యాడ్ల తయారీని ప్రారంభించడమే లక్ష్యంగా పనిచేస్తున్నామని మంత్రి శీధర్ బాబు తెలిపారు. సెమికండక్టర్ తయారీకి అవసరమైన కీలక సాంకేతికతలను తెలంగాణలోనే అభివృద్ధి చేయనున్నట్లు మంత్రి పేర్కొన్నారు. పరిశోధన నుంచి నైపుణ్యాభివృద్ధి, ప్రోటోటైపింగ్, చిప్ తయారీ వరకు సమగ్ర సెమికండక్టర్ ఎకోసిస్టమ్‌ను నిర్మించే దిశగా కాంగ్రెస్ ప్రభుత్వం కార్యాచరణ రూపొందించిందని మంత్రి శీధర్ బాబు వెల్లడించారు.

## కావాలనే కన్నెపల్లి పంపులు తెరవడం లేదు

### మరోమారు ప్రభుత్వంపై హరీష్ రావు ఆరోపణలు



**సిద్దిపేట, జులై 11 :** ప్రస్తుతం రాష్ట్రంలో ఉన్నది కాలం తెచ్చిన కరువు కాదని, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ కుటిల బుద్ధితో తెచ్చిన కరువు అని మాజీ మంత్రి హరీష్‌రావు ఆరోపించారు. గోదావరి నదిలో కావలసినన్ని నీళ్లు ఉన్నప్పటికీ, కేసీఆర్‌కు ఎక్కడ మంచి పేరు వస్తుందోనన్న ఈర్ష్యతో కన్నెపల్లి పంప్ హౌస్ మోటార్లను ప్రభుత్వం కావాలనే ఆన్ చేయడం లేదని విమర్శించారు. సిద్దిపేట జిల్లా నంగునూర్ మండలం తిమ్మాయ్‌పల్లి గ్రామంలో జరిగిన పెద్దమ్మ దేవాలయ ఉత్సవాల్లో హరీష్ రావు పాల్గొని మాట్లాడారు. సిద్దిపేట జిల్లా పెద్దమ్మ తల్లి రేవంత్ రెడ్డికి సద్బుద్ధిని ప్రసాదించాలని కోరుకున్నట్లు వెల్లడించారు. ఎంతటి కరవు వచ్చినా రైతాంగానికి నీరందించేలా కేసీఆర్ కాళేశ్వరం ప్రాజెక్టును నిర్మించారని, మోటార్లు ఆన్ చేస్తే రంగనాయక సాగర్ నిండి, సిద్దిపేట నియోజకవర్గంలోని దాదాపు 70 నుంచి 80 వేల ఎకరాలకు సాగునీరు అందుతుందని స్పష్టం చేశారు. కాళేశ్వరంతో ఒక్క ఎకరం కూడా పండలేదని వెల్లడించిన ముఖ్యమంత్రి తిమ్మాయిపల్లి గ్రామానికి వచ్చి ప్రజలతో మాట్లాడితే అర్దమవుతుందని అన్నారు. తిమ్మాయిపల్లిలో తాగునీటి కోసం మహిళలు ఖాళీ బిందెలతో ఎదురుచూసే పరిస్థితి ఉండేదని, కాళేశ్వరం జలాల రాకతో ఈ ప్రాంతం బంగారు పంటలతో కళకళలాడుతోందని సంతోషం వ్యక్తం చేశారు. ఆయిల్ పామ్ సాగు చేస్తున్న రైతులకు నర్మెట ఫ్యాక్టరీ ద్వారా అద్భుతమైన ఆదాయం లభిస్తోందని తెలిపారు.



## ప్రముఖ గాయని ఎస్. జానకి కన్నుమూత

### వయోభారంతో మైసూరులో మృతి

**మైసూరు, జులై 11 :** సుస్వరాల గొంతుక మూగబోయింది. తన గాన మాధుర్యంతో తెలుగు శ్రోతలను అలరించిన గంధర్వ గాయని పరలోకానికేగారు. ప్రముఖ గాయని ఎస్.జానకి కన్నుమూశారు. మైసూరులోని ఆసుపత్రిలో చికిత్స పొందుతూ శనివారం తుదిశ్వాస విడిచారు. ఆమె వయసు 88 సంవత్సరాలు. వయోధిక సమస్యలతో ఆమె కన్నుమూసినట్లు మనవరాలు అప్సర విద్యుల ఇన్‌స్టా వేదికగా ప్రకటించారు. దక్షిణ భారత గానకోకిలగా పేరుగాంచిన ఆమె అన్ని భాషల్లో కలిపి ఆమె సుమారు 50 వేలకు పైగా పాటలను పాడారు. 1938 ఏప్రిల్ 23న గుంటూరు జిల్లా రేపల్లె మండలం పల్లపట్ల గ్రామంలో ఎస్.జానకి జన్మించారు. తెలుగు చలన చిత్రసీమంలో ఆణిముత్యాల్లాంటి పాటలకు ఆమె ప్రాణం పోశారు. తెలుగు, తమిళ, మలయాళం, కన్నడ భాషల్లో అద్భుతమైన పాటలను పాడారు. ఆమె గాన మాధుర్యానికి నాలుగు జాతీయ అవార్డులు సహా, 33 వివిధ సినీ అవార్డులు వరించాయి. సంగీత ప్రపంచానికి ఆమె సేవను గుర్తించిన కేంద్ర ప్రభుత్వం 2013లో పద్మభూషణ్‌తో సత్కరించింది. తొలితరం ఘంటసాల నుంచి మలితరం బాలసుబ్రహ్మణ్యంతో కలిసి అద్భుత గీతాలు ఆలపించారు. పగలే వెన్నెలా అంటూ పలకరించిన మన జానకి లేదన్న విషయం సినీ ప్రపంచాన్ని దిగ్భ్రమకు గురిచేసింది. ప్రియమైన అమ్మమ్మ, దిగ్గజ గాయని ఎస్.జానకి కన్నుమూశారన్న వార్త తెలియజేయడానికి ఎంతో విచారిస్తున్నా. కుటుంబ సభ్యుల ప్రేమ, ఆప్యాయత మధ్య ప్రశాంతంగా మనల్ని విడిచి వెళ్లిపోయారు. ఆమె అద్భుతమైన జీవితాన్ని గడిపారు. తన గానంతో లక్షల మందికి ఆనందింపజేశారు. ఆమె ఒక దిగ్గజ గాయని. ఆమె పాటలు మధుర జ్ఞాపకాలు. ఈ దుఃఖ సమయంలో మా కుటుంబ ఏకాంతను గౌరవించాల్సిందిగా కోరుతున్నా' అని అప్సర తెలిపారు.

## వియత్నాం ఘటనపై మోడీ దిగ్భ్రాంతి

### బాధిత కుటుంబాలకు సానుభూతి ప్రకటన

**న్యూఢిల్లీ, జులై 11:** వియత్నాంలోని ఫు క్వాక్ దీవుల సమిపంలో ఘోర పడవ ప్రమాదం జరిగి 15 మంది భారతీయ పర్యాటకులు మృతిచెందిన విషాదకర ఘటనపై ప్రధాని నరేంద్ర మోదీ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. గాయపడిన వారు త్వరగా కోలుకోవాలని ప్రార్థించారు. ఈ మేరకు ఎక్స్ వేదికగా మోదీ పోస్టు చేశారు. 'వియత్నాంలోని ఫు క్వాక్ సమీపంలో భారతీయులు ప్రయాణిస్తున్న పడవ ప్రమాదానికి గురైన విషాద వార్త తెలిసి తీవ్రంగా కలత చెందాను. ప్రాణాలు కోల్పోయిన వారి కుటుంబాలకు నా సానుభూతి. గాయపడిన వారు త్వరగా కోలుకోవాలని ప్రార్థిస్తున్నాను. భారత రాయబార కార్యాలయం, కాన్సులేట్ అన్ని విధాలుగా సహాయ సహకారాలు అందిస్తున్నాయి. వియత్నాం అధికారులతో నిరంతరం సంప్రదింపులు జరుపుతున్నాం' అని ఎక్స్ వేదికగా ప్రధాని మోదీ తెలిపారు. ఈ ఘటనపై రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ కూడా దిగ్భ్రాం÷-రతి వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు సానుభూతి తెలిపారు. గాయపడిన వారు త్వరగా కోలుకోవాలని ఆయన ఆకాంక్షించారు. ఈ క్లిష్ట సమయంలో బాధిత కుటుంబాలకు భారత్ అండగా ఉంటుందని పేర్కొన్నారు. వియత్నాంలోని భారత రాయబార కార్యాలయం ప్రమాదానికి గురైన వారికి అవసరమైన అన్ని సహాయ సహకారాలు అందిస్తోందని రాజ్‌నాథ్ సింగ్ వెల్లడించారు. వియత్నాంలోని హోన్ మే రుట్ దీవి నుంచి బయలుదేరిన పర్యాటక పడవ సముద్రంలో ప్రమాదానికి గురైంది. మొత్తం 36 మంది ప్రయాణిస్తున్న ఈ బోటులో 32 మంది భారతీయ పర్యాటకులు, నలుగురు సిబ్బంది ఉన్నారు. తీరానికి సుమారు 400 మీటర్ల దూరంలో బలమైన అలల కారణంగా పడవ ఒక్కసారిగా బోల్తా పడింది. ప్రమాదం జరిగిన వెంటనే స్థానిక అధికారులు సహాయక చర్యలు చేపట్టారు. 21 మందిని సురక్షితంగా కాపాడారు. అయితే ఇద్దరు మహిళలు, 13 మంది పురుషులు సహా మొత్తం 15 మంది భారతీయులు మృతి చెందినట్లు అధికారులు నిర్ధారించారు.



## షాబాద్ హత్యల ఘటన అత్యంత దారుణం

### నిందితుడికి బెయిల్ రాకుండా ఎందుకు అడ్డుకోలేదు
### ఇది ముమ్మాటికీ ప్రభుత్వ వైఫలమే అన్న కెటిఆర్

**హైదరాబాద్, జులై 11 :** పోక్సో కేసు పెట్టారనే కక్షతో రంగారెడ్డి జిల్లా షాబాద్‌లో ఆరుగురిని హత్య చేసిన ఘటన రాష్ట్రవ్యాప్తంగా కలకలం రేపిన విషయం తెలిసిందే. ఈ ఘటనపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ స్పందించారు. షాబాద్‌లో జరిగిన సంఘటన అతి దారుణమైంది. అందరం కూడా కలత చెందే ఒక దరిద్రమైన వార్త అని కేటీఆర్ అన్నారు. పోక్సో లాంటి ఘటన జరిగిన తర్వాత, ఒక మైనర్ బాలిక మీద అత్యాచారం జరిగిన తర్వాత వారికి బెయిల్ ఇవ్వడం.. బెయిల్ ఇచ్చే క్రమంలో న్యాయమూర్తుల దగ్గర ప్రభుత్వం తన వాదనలను పటిష్టంగా వినిపించకపోవడం వల్లనే ఈ పరిస్థితి వచ్చిందని అనుకుంటున్నానని అన్నారు.. ఏ అమ్మాయి మీదైతే అత్యాచారం జరిగిందో.. అఘాయిత్యం జరిగిందో.. ఆ అమ్మాయి, కుటుంబసభ్యులు భయపడుతూ దయచేసి ఆ దుర్మార్గుడికి బెయిల్ ఇవ్వొద్దు అని చెప్తుంటే కూడా మీరు పెడచెవిన పెట్టి కోర్టులో న్యాయమూర్తికి సరిగ్గా నివేదించకపోవడం వల్ల ఈ దుర్మార్గం జరిగిందన్నారు. షాబాద్‌లో జరిగిన ఆరు హత్యలు ముమ్మాటికి ప్రభుత్వ హత్యలు.. ప్రభుత్వ నిర్లక్ష్యంతో జరిగిన హత్యలేనని కేటీఆర్ అన్నారు. ఈ ఆరుగురి హత్యకు కచ్చితంగా హోంశాఖ వైఫల్యం, నిందితుడికి బెయిల్ వచ్చేలా నిర్లక్ష్యంగా వాదించిన న్యాయవాదుల వైఫల్యమే కారణమన్నారు. రేవంత్ రెడ్డి కచ్చితంగా సమాధానం చెప్పాలి. ఇట్లాంటి దుర్మార్గులకు బెయిల్ ఎందుకు ఇస్తున్నరు. ఏ కారణం చేత వాళ్లకు బెయిల్ ఇచ్చి ఈ మానవ మృగాలను సమాజంలోకి మీరు వదులుతున్నారు. ఎవరు బాధ్యులు..? అని కేటీఆర్ అడిగారు. ఓ ఆడపిల్ల తండ్రిగా అడుగుతున్నా.. ఎంత బాధ అవుతది.. అఘాయిత్యం జరుగడమే ఘోరమంటే.. అఘాయిత్యం జరిగిన తర్వాత పబ్లిక్‌గా వచ్చి చెప్పుకోవడమే భయంకరమైన పరిస్థితి అంటే దాని మీదికెల్లి ఇవాళ ఆ మానవ మృగాలకు బెయిళ్లు ఇచ్చి వాళ్ల పలుకుబడి, డబ్బులను ఉపయోగించుకొని అఘాయిత్యాలు చేస్తుంటే సిగ్గులేకుండా పబ్లిక్ ప్రాసిక్యూటర్లు నోరు మూసుకుని కూర్చుని.. ఏ ధైర్యంతో రేపటి రోజున ఆడపిల్లలు ఏమన్నా జరిగితే బయటకు వచ్చి ఫిర్యాదు చేస్తరని ప్రశ్నించారు. తల్లిదండ్రులు భయపడరా.. ? సిగ్గుండాలి ఈ ప్రభుత్వానికి, సీఎం రేవంత్ రెడ్డికి అని ఫైర్ అయ్యారు.

## పవన్ కళ్యాణ్ భుజానికి శస్త్ర చికిత్స

### ప్రకటన విడుదల చేసిన డిప్యూటి సిఎం కార్యాలయం



**అమరావతి, జులై 11 :** ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌కు శనివారం ముంబైలోని ఓ ఆస్పత్రిలో భుజానికి విజయవంతంగా శస్త్రచికిత్స జరిగింది. ఈ మేరకు డిప్యూటీ సీఎం కార్యాలయ అధికారులు ఎక్స్‌లో పోస్ట్ పెట్టారు. ప్రపంచ ప్రఖ్యాత ఆర్థోపెడిక్ సర్జన్, స్పోర్ట్స్ మెడిసిన్ నిపుణుడు డాక్టర్ దిన్‌షా పార్థివాలా నేతృత్వంలోని వైద్యుల బృందం ఈ శస్త్రచికిత్సను నిర్వహించారని తెలిపారు. పవన్ కల్యాణ్‌కు రెండు భుజాల్లోనూ తీవ్రమైన రోటేటర్ కఫ్ గాయాలు ఉన్నట్లు నిర్ధారించారని చెప్పారు. రోటేటర్ కఫ్ చిరగడంతో పాటు, ఆయన కుడి భుజంలో అవల్షన్ ఫ్రాక్చర్ ఏర్పడటంతో ఓ పెద్ద శస్త్రచికిత్స అవసరమైందని అన్నారు. ఆయన కుడి భుజానికి చేసిన ఈ శస్త్రచికిత్స సుమారు మూడున్నర గంటల పాటు కొనసాగించారని.. ఈ సర్జరీ విజయవంతంగా పూర్తయిందని అధికారులు తెలిపారు. పవన్ కల్యాణ్‌ను ఆపరేషన్ అనంతరం రికవరీ గదికి తరలించారని అధికారులు తెలిపారు. ఉప ముఖ్యమంత్రి అనస్థీషియా ప్రభావం నుంచి బాగా కోలుకుంటున్నారని చెప్పారు. చికిత్స అందిస్తున్న వైద్య బృందం నిశిత పర్యవేక్షణలో డిప్యూటీ సీఎం ఉన్నారని వెల్లడించారు. వీలైనంత త్వరగా శస్త్రచికిత్స చేయించుకోవాలని వైద్య నిపుణులు సలహా ఇచ్చారని అన్నారు. ముందుగా తన అధికారిక కార్యక్రమాలను దృష్టిలో ఉంచుకుని, పవన్ కల్యాణ్ శస్త్రచికిత్స చేయించుకోవడానికి ముందే వాటిని పూర్తి చేయాలని నిర్ణయించారని చెప్పారు. రెండు భుజాలకు ఒకేసారి శస్త్రచికిత్స చేయడంతో ఆపరేషన్ తర్వాత గణనీయమైన అసౌకర్యం, కదలిక పరిమితి ఏర్పడే అవకాశం ఉందని చెప్పారు. ఈ క్రమంలో వైద్య బృందం మొదట కుడి భుజానికి శస్త్రచికిత్స చేయాలని నిర్ణయించిందని డిప్యూటీ సీఎం కార్యాలయ అధికారులు పేర్కొన్నారు. పవన్ కల్యాణ్ తగినంత కోలుకున్న తర్వాత ఎడమ భుజానికి శస్త్రచికిత్స చేయాలని ప్రణాళిక చేశారని అధికారులు తెలిపారు. ఆయన అవిశ్రాంత ప్రజా కార్యక్రమాలు, విస్తృత రాజకీయ పర్యటనలు, ఎన్నికల ప్రచారాలు, పార్టీ కార్యకర్తలు, శ్రేయోభిలాషులతో నిరంతర సంభాషణల కారణంగా, 2016లో అయిన ఈ భుజం గాయాలు సంవత్సరాలు గడిచేకొద్దీ క్రమంగా తీవ్రమయ్యాయని వెల్లడించారు. నిరంతర నొప్పిని భరిస్తున్నప్పటికీ, ఉప ముఖ్యమంత్రి ఎలాంటి అంతరాయం లేకుండా తన అధికారిక బాధ్యతలను నిర్వర్తిస్తూ, ప్రజా కార్యక్రమాల్లో పాల్గొంటూనే ఉన్నారని అన్నారు. పవన్ కల్యాణ్ కోలుకోవడానికి సంబంధించిన మరిన్ని వివరాలు తగిన సమయంలో తెలియజేస్తామని డిప్యూటీ సీఎం కార్యాలయ అధికారులు పేర్కొన్నారు.

## బోర్‌వెల్ డ్రిల్లింగ్ పనుల్లో విషాదం

### కరెంట్ షాక్‌తో నలుగురు కార్మికుల దుర్మరణం

**చెన్నై, జులై 11 :** తమిళనాడులో విషాద ఘటన చోటుచేసుకుంది. చెంగల్పట్టు జిల్లా మామల్లపురంలో బోర్‌వెల్ తవ్వకాల సమయంలో జరిగిన విద్యుత్ ప్రమాదంలో నలుగురు కార్మికులు ప్రాణాలు కోల్పోయారు. ఈ ఘటన స్థానికంగా తీవ్ర విషాదాన్ని నింపింది. శనివారం మామల్లపురం ఈస్ట్ కోస్ట్ రోడ్డులోని తమిళనాడు టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ పెట్రోల్ బంక్ ఎదురుగా బోర్‌వెల్ డ్రిల్లింగ్ పనులు జరుగుతున్నాయి. ఈ సమయంలో డ్రిల్లింగ్ యంత్రం సమీపంలోని విద్యుత్ లైన్‌కు తాకినట్లు సమాచారం. విద్యుత్ తీగలకు డ్రిల్లింగ్ యంత్రం తగలడంతో ఒక్కసారిగా కరెంట్ ప్రవహించింది. అక్కడే పనిచేస్తున్న నలుగురు కార్మికులు విద్యుత్ షాక్‌కు గురయ్యారు. ప్రమాద తీవ్రత ఎక్కువగా ఉండటంతో వారు అక్కడికక్కడే మృతి చెందారు. సమాచారం అందిన వెంటనే పోలీసులు, విద్యుత్ శాఖ అధికారులు, సహాయక సిబ్బంది ఘటనాస్థలికి చేరుకున్నారు. మృతుల వివరాలను సేకరించే పనిలో అధికారులు నిమగ్నమయ్యారు. ఈ ఘటనకి గల కారణాలపై పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. మృతుల కుటుంబాలకు సమాచారం అందించి, అవసరమైన సహాయక చర్యలు చేపడుతున్నారు.

## నరహంతకుడిని పట్టుకోండి

### పోలీస్ స్టేషన్ ముందు గ్రామస్థుల ధర్నా
### ఎమ్మెల్యే కాలే యాదయ్యను నిలదీసిన ప్రజలు
### ఎస్ఐ సస్పెన్షన్.. నిందితుడి ఆచూకీ కోసం 2లక్షల రివార్డు

**రంగారెడ్డి, జులై 11 :** రంగారెడ్డి జిల్లాలో ఆరుగురిని హత్య చేసిన నిందితుడిని అప్పగించాలని డిమాండ్ చేస్తూ స్థానికులు చేపట్టిన ఆందోళన ఉద్రిక్తంగా మారింది. పోలీస్‌స్టేషన్ వద్దకు చేరుకున్న ఎమ్మెల్యే కాలే యాదయ్యను ఆందోళనకారులు అడ్డుకున్నారు. నిందితుడిని కఠినంగా శిక్షించాలని, బాధితులను ఆదుకోవాలని ఎమ్మెల్యేతో వాగ్వాదానికి దిగారు. పోలీసుల వైఖరిని ఖండిస్తూ స్థానికులు నినాదాలు చేశారు. జిల్లా కలెక్టర్ నారాయణరెడ్డి షాబాద్ పీఎస్ వద్దకు చేరుకుని ఆందోళనకారులకు సర్దిచెప్పే ప్రయత్నం చేశారు. బాధిత కుటుంబాలను ప్రభుత్వం ఆదుకుంటుందని హామీ ఇచ్చారు. కేసులో నిర్లక్ష్యంగా వ్యవహరించిన పోలీసులపై చర్యలు ఉంటాయని స్పష్టం చేశారు. షాబాద్‌లో బాధితులను కలిసి మాజీ మంత్రి సత్యవతి రాథోడ్ సంఘీభావం తెలిపారు. నిర్లక్ష్యంగా వ్యవహరించిన సీఐ, ఎస్ఐపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. మృతుల బంధువులు షాద్‌నగర్-కంది రహదారిపై బైఠాయించడంతో రాకపోకలకు తీవ్ర అంతరాయ-ఏమేర్పడింది. ఇదిలావుంటే ఆరుగురు దారుణ హత్యకు గురైన ఘటనపై పోలీసులు కీలక ప్రకటన చేశారు. నిందితుడు రాజ్‌కుమార్‌పై రూ.2 లక్షల రివార్డు ప్రకటించారు. అతడి ఆచూకీ తెలిపిన వారికి ఈ మొత్తాన్ని అందజేస్తామన్నారు. ఈ ఘటనలో షాబాద్ ఎస్సై రమేశ్‌ను సస్పెండ్ చేసినట్లు రంగారెడ్డి జిల్లా కలెక్టర్ సి.నారాయణరెడ్డి వెల్లడించారు. ఈ కేసులో నిర్లక్ష్యం వహించిన అందరిపైనా కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. బాధిత కుటుంబానికి ప్రభుత్వం తరఫున అండగా ఉంటామన్నారు. మరోవైపు పరారీలో ఉన్న నిందితుడి కోసం 10 ప్రత్యేక బృందాలతో పోలీసులు గాలింపు చర్యలు చేపట్టారు. సాంకేతిక ఆధారాలు, సీసీటీవీ దృశ్యాలు, టోల్‌ఎ÷-లాజా వివరాల ఆధారంగా దర్యాప్తు వేగవంతం చేశారు. దైవాలగూడకు చెందిన పార్వతి రాజ్ కుమార్ కట్టుకున్న భార్య, ఇద్దరు కుమారులతో పాటు, తనపై పోక్సో కేసు పెట్టిన మైనర్ బాలిక, ఆమె తల్లి లక్ష్మి, నాయనమ్మ రుక్కమ్మలను కత్తితో నరికి చంపిన విషయం తెలిసిందే. అనంతరం బాలికను దైవాల గూడ సమీపంలోని అఖిల్ సాగర్ చెరువు సమీపంలోకి తీసుకెళ్లి పీక కోసి హత్య చేశాడు. తన ఇంటికొచ్చి భార్య, ఇద్దరు కుమారులు పరీక్షిత్ (4), దైవీక్షిత్ (2)లను కత్తితో పీకలు కోసి దారుణంగా హతమార్చాడు.

## డ్రగ్స్ మాఫియాపై ఈగిల్ ఉక్కుపాదం

### ఏడాది కాలంగా ఏడుటన్నులు గంజాయి స్వాధీనం

**హైదరాబాద్, జులై 11 :** డ్రగ్స్ మాఫియాపై తెలంగాణ ఈగల్ ఫోర్స్ అధికారులు ఉక్కుపాదం మోపుతున్నారు. గత ఏడాదిలో ఏకంగా ఏడు టన్నుల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. తెలంగాణను డ్రగ్స్ ట్రాన్సిట్ హబ్‌గా మార్చే ప్రయత్నాలకు చెక్ పెట్టారు. ఈగల్ అధికారులు, ఇంటెలిజెన్స్‌తో దేశవ్యాప్తంగా వరుసగా భారీగా డ్రగ్స్‌ను సీజ్ చేశారు. రాంచీలో 500 కిలోలు, ఒడిశాలో 500 కేజీలు, తాజాగా 385 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. ఏడు రోజుల నిఘాతో డ్రగ్స్ రవాణా ముఠా ఆగడాలను ఆటకట్టించారు. ఛత్తీస్‌గఢ్, మహారాష్ట్ర సరిహద్దులో 385 కేజీల గంజాయిని ఈగల్ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. ఏడు రోజుల పాటు నిఘా ఉంచి డ్రగ్స్ రవాణా ముఠాను ట్రాక్ చేశారు. ఒడిశాలోని జయ్‌పూర్ సమీపంలోని దేవఘాటి నుంచి బయలుదేరిన గంజాయి లోడ్‌ను నిరంతరం ఫాలో అయ్యారు. కోల్‌కతా, ముంబై జాతీయ రహదారిపై గంజాయి వాహనాన్ని ఎన్సీబీ రాయ్‌పూర్ బృందం అడ్డుకుంది. మహారాష్ట్ర, రాజస్థాన్‌కు తరలిస్తున్న గంజాయిని గమ్యానికి చేరకముందే స్వాధీనం చేసుకున్నారు. కేసులో రాజస్థాన్‌కు చెందిన డ్రైవర్ మహదేవ్ భీల్‌ను అరెస్ట్ చేశారు. తెలంగాణ ఈగల్ ఫోర్స్ అధికారులు ఇచ్చిన ఖచ్చితమైన సమాచారంతో ఎన్సీబీ అధికారులు ఆపరేషన్ విజయవంతం చేశారు. రాష్ట్ర సరిహద్దులు దాటి డ్రగ్స్ మాఫియాపై ఈగల్ అధికారులు ఉక్కుపాదం మోపుతున్నారు. జాతీయ స్థాయి డ్రగ్స్ వ్యతిరేక పోరులో కీలక శక్తిగా ఈగల్ అధికారులు మారారు. డ్రగ్స్ ఫ్రీ తెలంగాణ లక్ష్యంతో మరింత దూకుడుగా ఈగల్ అధికారులు చర్యలు చేపట్టారు. డ్రగ్స్‌పై సమాచారం ఉంటే వెంటనే 1908 నంబర్‌కు సమాచారం ఇవ్వాలని ఈగల్ అధికారులు ప్రజలకు పిలుపునిచ్చారు.

## అంతర్రాష్ట్ర దొంగల ముఠా హల్‌చల్

### ఒకే రాత్రి నాలుగు చోట్ల దొంగతనాలు

**నిజామాబాద్, జులై 11 :** నిజామాబాద్ జిల్లాలో అంతర్రాష్ట్ర దొంగల ముఠా హల్‌చల్ సృష్టించింది. ఒకే రాత్రి నాలుగు చోట్ల దొంగతనాలకు పాల్పడింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. శుక్రవారం అర్ధరాత్రి దాటిన తర్వాత టాటా సుమోలో వచ్చిన నలుగురు దొంగలు ముందుగా నిర్మల్ జిల్లాలోని ఓ అపార్ట్‌మెంట్‌లో దోపిడీకి పాల్పడ్డారు. అక్కడి నుంచి నిజామాబాద్ జిల్లాలోకి ప్రవేశించి, తెల్లవారుజామున ఆర్మూర్ పట్టణంలోని ఓ మెడికల్ షాప్ షట్టర్ ధ్వంసం చేసి అందులోని సుమారు లక్షన్నర నగదును దోచుకున్నారు. అనంతరం ఆ దొంగల ముఠా తమ వాహనంలో తెల్లవారుజామున 4.55 గంటల వరకు శ్రీనగర్ కాలనీకి చేరుకుని.. లక్ష్మి అనే మహిళ మెడలో నుంచి రెండు తులాల బంగారు పుస్తెలతాడు తెంపుకుని పరారయ్యారు. ఆ తర్వాత ఉదయం 5.25 గంటల వరకు నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని దుబ్బ ప్రాంతానికి చేరుకున్నారు. అక్కడ ఇంటి ముందు వాకిలి ఊడుస్తున్న ఓ మహిళ మెడలో నుంచి బంగారు పుస్తెలతాడుతో పాటు ఒక చెవికమ్మను లాక్కున్నారు. మరో చెవికమ్మ లాక్కునే ప్రయత్నం చేస్తుండగా బాధితురాలి కేకలు విని ఆమె భర్త బయటకు పరిగెత్తుకుంటూ వచ్చాడు. దీంతో వారు టాటా సుమో వాహనంలో అక్కడి నుంచి పరారయ్యారు. దీనిపై సమాచారం అందుకున్న పోలీసులు ఘటన జరిగిన ప్రాంతాలను పరిశీలించారు. మహారాష్ట్రకు చెందిన అంతర్రాష్ట్ర దోపిడీ ముఠా ఈ చోరీలకు పాల్పడి ఉంటుందని పోలీసులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. ఈ సందర్భంగా ఘటనాస్థలిని పరిశీలించిన నిజామాబాద్ సీపీ పి. సాయి చైతన్య ఘటనాస్థలిని క్షుణ్ణంగా పరిశీలించారు. బాధితురాలితో మాట్లాడి ఘటనకు సంబంధించి వివరాలు తెలుసుకున్నారు. అనంతరం దర్యాప్తు అధికారులకు కీలక సూచనలు చేశారు. ఘటన జరిగిన ప్రాంతాల్లోని సీసీటీవీ కెమెరాల ఫుటేజీలను పరిశీలించాలని.. నిందితులను వేగంగా పట్టుకోవాలని ఆదేశించారు. ఈ సందర్భంగా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సీపీ సూచించారు. అనుమానాస్పద వ్యక్తులు కనిపిస్తే వెంటనే సమీప పోలీస్ స్టేషన్‌కు లేదా డయల్ 100కు సమాచారం అందించాలని విజ్ఞప్తి చేశారు.

# గందరగోళంగా సర్ ప్రక్రియ!



**సర్ ప్రక్రియలో గందరగోళం కనిపిస్తోంది. బిఎల్‌వోలు ఎక్కడా సరిగా కనిపించడం లేదు. ముఖ్యంగా హైదరాబాద్ పట్టణంలో గేటెడ్ కమ్యూనిటీల్లో వారి ఆచూకీ లేదు. కనీసం సంప్రదించిన దాఖలాలు లేవు. మరోవైపు స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ ప్రక్రియ సర్ తుది అంకానికి చేరుకుంది. అధికారికంగా 14వ తేదీ ఆఖరు గడువు అయినా ఎన్యూమరేషన్ ఫారాలను బీఎల్‌వోలకు అందజేయాలని ప్రజలకు విజ్ఞప్తి చేస్తున్నారు. డిజిటలైజేషన్‌కు సమయం కావాల్సి ఉండడంతో అధికారులు ముందస్తు జాగ్రత్త తీసుకుంటున్నారు. మరోవైపు పెద్దఎత్తున ప్రచారం చేస్తున్నా ప్రజల్లో ఆశించిన స్పందన రావడం లేదని అధికారులు వాపోతుండగా ఆ ఫారాలను పూరించడం కష్టతరమని రాజకీయ పార్టీల ఏజెంట్లు వ్యాఖ్యానిస్తున్నారు.**

సర్ పక్రియలో సాంకేతిక సమస్యలు తలెత్తకుండా ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాల్సిన అవసరం ఉంది. చివరి రోజులు సర్వర్ సమస్య తలెత్తకుండా చూసుకోవాల్సి ఉంటుంది. ఇకపోతే ఎన్నికల సంఘం నిబంధనల ప్రకారం ఒక వ్యక్తికి ఒక్కచోటే ఓటు ఉండాలని.. అలాకాకుండా రెండు, అంతకన్నా ఎక్కువ చోట్ల ఓటు ఉంటే అది చట్టవిరుద్ధమని తెలంగాణ ఎన్నికల ప్రధాన అధికారి సి.సుదర్శన్ రెడ్డి తెలిపారు. అలా ఉంటే ఏడాది జైలు శిక్ష, జరిమానా పడుతుందని హెచ్చరించారు. ఇదంతా ఒక ఎత్తయితే ప్రవాసుల ఓట్ల గురించి ఎక్కడా ప్రస్తావించడం లేదు. ఉభయ తెలుగు రాష్ట్రాల నుంచి లక్షల మంది జీవనోపాధి కోసం విదేశాల్లో ఉంటున్నారు. వారు అడపాదడపా వచ్చి వెళుతుంటారు. వారి గురించి ఎన్నికల సంఘం తెలియ చేయాల్సిన అవసరం ఉంది. రాష్ట్రంలోని ఓటరు జాబితా ఆధారంగా.. ఎవరికైనా రెండు చోట్ల ఓటు ఉంటే గుర్తించగలుగుతారు. అదే రెండు రాష్ట్రాల్లో ఉంటే దాన్ని ఈసీఐ గుర్తించాల్సి ఉంటుంది. ఒకే వ్యక్తికి రెండు మూడు చోట్ల ఓట్లు ఉన్నట్లు గుర్తిస్తే, విచారణ జరిపి చర్యలు తీసుకుంటారని అంటున్నారు. ఉద్దేశపూర్వకంగా తప్పుడు సమాచారం ఇచ్చి రెండు చోట్లా ఓటుహక్కు పొందినవారికి ఈసీఐ జారీచేసే నోటీస్ ఆధారంగా... ఏడాది జైలు శిక్షతో పాటు పెనాల్టీ కూడా పడుతుందని సీఈవో హెచ్చరించారు.

సర్ ముఖ్య ఉద్దేశం.. ఓటర్ల జాబితాలో చనిపోయిన వారి పేర్లను తొలగించడం, ఇతర తప్పులను సరిదిద్ది జాబితాను పూర్తిస్థాయిలో ఆధునీకరించడం లక్ష్యం. ప్రతి ఒక్క ఓటరూ ఈ పక్రియలో పాల్గొనాల్సిందేనని.. సాధారణ పౌరుల నుంచి సీఎం, పీఎం దాకా ప్రతి ఒక్కరూ ఎన్యూమరేషన్ ఫారం నింపాల్సిందేనని.. ఎవరికీ మినహాయింపులు ఉండవని ఇసి స్పష్టం చేసినా, సామాన్యుల చెంతకరు వెళ్లాల్సిన బిఎల్‌వోలు వెళ్లకుంటే దానికి ఎవరు బాధ్యతులన్నది ప్రశ్న. జీవనోపాధికై గల్ఫ్ తదితర దేశాలకు వెళ్లిన తెలుగువారిలో అత్యధికులు గ్రామీణులే. వీరి విద్యార్హతలు అంతంత మాత్రమే. చిన్న చితకా పనులు చేస్తూ ప్రతి నెలా క్రమం తప్పకుండా కొంత డబ్బును తమ కుటుంబాలకు పంపుతూ స్వదేశంలోని కుటుంబాలను పోషించుకుంటున్నారు. నే ఈ శ్రామిక జనులలో ఎక్కువ భాగం బడుగు, బలహీన వర్గాల వారే. పరాయి దేశంలో నివసిస్తున్నా, వారి మనసంతా సొంతూరు చుట్టే ఉంటుంది. సర్ కార్యక్రమంలో భాగంగా ఉభయ తెలుగు రాష్ట్రాల్లో మొదలైన ఆ 'సవరణ' పక్రియ అసంఖ్యాక ప్రవాసులపై ప్రత్యక్ష, పరోక్ష ప్రభావం చూపించడం ఖాయం. ఇప్పటి వరకు 'సర్' పూర్తయిన రాష్ట్రాలలో లక్షలాది వలస కార్మికులు, మహిళలు నష్టపోయారు. ఉపాధి వలసలు ఎక్కువగా ఉన్న తెలుగు రాష్ట్రాల్లో 'సర్' ప్రభావం ఉంటుంది. ప్రవాస కార్మికులు అవగాహనా రాహిత్యంతో ఈ విషయాన్ని పట్టించుకోవడం లేదు. వారికి సరైన మార్గదర్శకత్వం చేసే నాయకత్వం కూడా కరువయింది.

ప్రజాప్రాతినిధ్య చట్టం ప్రకారం, ఒక వ్యక్తి ఒక ప్రదేశంలో ఆరు నెలలకు మించి నివాసం ఉండని పక్షంలో అతను లేదా ఆమె పేరును తొలగించడం ఖాయం. ప్రవాసులే కాదు, రాజకీయ నాయకులు సైతం ఓటరుగా తాము నమోదైన ప్రదేశాలలో నివసిస్తూ ఉండరనేది వేరే విషయం. ప్రవాసులు తమ పాస్‌పోర్టుల్లో చిరునామాగా పేర్కొన్న ప్రదేశంలో ప్రవాస ఓటరుగా నమోదు చేసుకునే అవకాశం ఉన్నది. అయితే దేశవ్యాప్తంగా ఇలా ప్రవాస ఓటరుగా నమోదు చేసుకునే వారి సంఖ్య స్వల్పమే. ప్రవాస ఓటరుగా నమోదయితే రేషన్‌కార్డు గల్లంతవుతుందనే భయానికి తోడుగా పేర్లు, వయస్సులోని వ్యత్యాసాల కారణంగా ఈ రకమైన నమోదుకు అత్యధికులు ఇష్టపడడం లేదు. ప్రవాసులకు సంబంధించిన ఈ కీలక అంశాలపై సరైన సమాచారంతో సుదూర దేశంలో బతుకు దెరువు పొందుతున్న వారికి స్థానిక నాయకులు దిశా నిర్దేశర చేయవల్సిన అవసరం ఉంది. విదేశాలలో, ప్రత్యేకించి గల్ఫ్ దేశాలలో ఉపాధి పొందుతున్న తెలుగువారు లక్షల సంఖ్యలో ఉన్నారు. ఈ తెలుగు ప్రవాసుల ఉనికి విషయమై ఉభయ తెలుగు రాష్ట్రాల్లో పాలకులకుగానీ, రాజకీయ పక్షాలకుగానీ ఎలాంటి సూచనలు చేయడం లేదు. ఇలా ఇక్కడ లేని వారి పేర్లు తొలగిస్తే విదేశాల్లో బతుకుదెరువు కోసం పోయిన వారి ఓట్లు గల్లంతు అవుతాయి. తెలంగాణలోని నిజామాబాద్, కరీంనగర్, వరంగల్ లాంటి జిల్లాలోని పలు గ్రామాల వారు అనేక మంది గల్ఫ్ దేశాలలో జీవనోపాధి పొందుతున్నారు. ఉభయ తెలుగు రాష్ట్రాలలోని గ్రామీణ ప్రాంతాలతో పాటు హైదరాబాద్ మహానగర పాతబస్తీలోని అన్ని నియోజకవర్గాల నుంచి కూడా గల్ఫ్‌కు వలస వచ్చిన ఓటర్లు గణనీయమైన సంఖ్యలో ఉన్నారు. వీరంతా జాగ్రత్త పడకపోతే ఓటు గల్లంతు ఖాయం.

# 1000 క్షిపణులను లోడ్ చేసిపెట్టాం

**నన్ను చంపాలనుకుంటే ఇరాన్ మటాష్**

**ఊహించని విధంగా అంతం చేస్తాం**

**ఇరాన్‌కు ట్రంప్ తీవ్ర హెచ్చరికలు**



**వాషింగ్టన్, జూలై 11 :** అమెరికా-ఇరాన్ మధ్య తాత్కాలిక ఒప్పందం కుదిరినప్పటికీ.. ఉద్రిక్తతలు ఏమాత్రం సమసిపోలేదు. రెండుదేశాలు పరస్పరం దాడులు చేసుకుంటున్నాయి. ఈ క్రమంలో ఇరాన్‌కు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మరో వార్నింగ్ ఇచ్చారు. ఒకవేళ వారు తనను హత్య చేయాలని ప్రయత్నిస్తే.. క్షిపణుల వర్షం తప్పదని హెచ్చరించారు. డొనాల్డ్ ట్రంప్ ఇరాన్‌కు మరోసారి ఘాటైన హెచ్చరిక జారీ చేశారు. తనపై హత్యాయత్నం చేయడానికి ఇరాన్ ప్రయత్నిస్తే, ఆ దేశంపై క్షిపణుల వర్షం తప్పదని వార్నింగ్ ఇచ్చారు. తాము ఇప్పటికే 1,000 క్షిపణులను సిద్ధం చేసి ఉంచామని ఆయన పేర్కొన్నారు. అవసరమైతే వేల క్షిపణులతో భారీ ప్రతీకార దాడులు జరుగుతాయని ట్రంప్ తన సామాజిక మాధ్యమ వేదిక 'ట్రూత్' ద్వారా వెల్లడించారు. నన్ను హత్య చేయాలని ఇరాన్ ప్రయత్నిస్తే భారీ విధ్వంసం తప్పదు. 1,000 క్షిపణులు ఇప్పటికే లక్ష్యాలను గురిపెట్టి సిద్ధంగా ఉన్నాయి. అంతటితోనే ఆగదు. అవసరమైతే మరిన్ని దాడులు జరుగుతాయి. ఇప్పటికే ఈ విషయమై సైన్యానికి ఆదేశాలు అందాయి. ఇరాన్‌లోని అన్ని ప్రాంతాలను ధ్వంసం చేయడానికి అమెరికా సైన్యం సిద్ధంగా ఉంది' అని ట్రంప్ హెచ్చరించారు. తనపై ఇరాన్ హత్యాయత్నం చేసే అవకాశం ఉందని గతంలో కూడా ట్రంప్ ఆరోపించారు. అలాంటి ప్రయత్నం జరిగితే అమెరికా ప్రతిస్పందన అత్యంత తీవ్రంగా ఉంటుందని, ఇరాన్ కీలక సైనిక స్థావరాలపై భారీ దాడులు జరుగుతాయని స్పష్టం చేశారు. కాగా, ఇప్పటికే హోర్ముజ్ జలసంధి, అణు ఒప్పందం వంటి అంశాలపై ఉద్రిక్తతలు కొనసాగుతున్న సమయంలో ఈ హెచ్చరికలు పరిస్థితిని మరింత సంక్లిష్టం చేసే అవకాశం కనబడుతోంది. ఇరాన్‌లోని అన్ని ప్రాంతాలను పూర్తిగా ధ్వంసం చేయడానికి తమ సైన్యం సిద్ధంగా ఉందని పేర్కొన్నారు. అంతకుముందు మీడియాతో మాట్లాడుతూ ట్రంప్ ఇదే తరహా వ్యాఖ్యలు చేశారు. తనను చంపడంలో ఆ దేశం సఫలమైతే.. తదుపరి ఏం చేయాలన్నదానిపై ఇప్పటికే సూచనలు జారీ చేశానన్నారు. 'ఏదైనా జరిగితే.. ఇంతకు ముందెన్నడూ లేనంత భారీ స్థాయిలో ఇరాన్ పై బాంబుల వర్షం కురిపించాలని నేను సూచనలు జారీ చేశా. అయితే టెహ్రాన్ నన్ను చంపడంలో విఫలమవుతుందని ఆశిస్తున్నా అని పేర్కొన్నారు. హార్మూజ్‌లో ప్రయాణిస్తోన్న నౌకలపై ఇరాన్ దాడులు చేయడం.. ఆ వెంటనే ఆ దేశంపై అమెరికా క్షిపణుల వర్షం కురిపించడంతో మరోసారి పశ్చిమాసియాను యుద్ధమేఘాలు కమ్మేశాయి. ఈ క్రమంలోనే డీల్ ముగిసిందంటూ ట్రంప్ ప్రకటన చేశారు. దాంతో.. ఇప్పటికే అంగీకరించిన అంశాల్లో వేటినైనా ఉల్లంఘిస్తే ప్రతిచర్య తప్పదని ఇరాన్ హెచ్చరించింది. చర్చలను కొనసాగించాలని తాము కోరినట్లు ట్రంప్ చేసిన వ్యాఖ్యలను కూడా ఖండించింది. తాము లొంగిపోవడంతోనే యుద్ధం ముగియదని ఇరాన్ పార్లమెంటర్ స్పీకర్ ఘాలిబఫ్ పేర్కొన్నారు. యుద్ధాన్ని ముగించడం ప్రపంచ దేశాలకు ప్రాధాన్యాంశం. ఇరాన్ లొంగిపోవడంతో ఎప్పటికీ ఈ యుద్ధం ముగిసిపోదని ప్రతి ఒక్కరు తెలుసుకోవాలి. అమెరికన్లు ఎప్పుడైతే అవగాహన ఒప్పందాన్ని ఉల్లంఘిస్తారో.. అప్పుడు మమ్మల్ని మేము రక్షించుకోవడానికి సిద్ధంగా ఉంటాం అని వెల్లడించారు. అలాగే యుద్ధానికి సిద్ధంగా ఉన్నవారే.. అమెరికాతో చర్చలు జరపగలరని వ్యాఖ్యానించారు.

# భారత్ లక్ష్యం యుద్ధం కాదు

- ప్రపంచ శాంతి, స్థిరత్వమే మా విధానం
- భద్రతకు ముప్పు వాటిల్లినందునే ఆపరేషన్ సిందూర్
- అత్యాధునిక యుద్ధ నౌక ఐఎన్ఎస్ మహేంద్రగిరి జాతికి అంకితం
- కేంద్ర రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ స్పష్టీకరణ



**విశాఖపట్నం, జూలై 11 :** భారత్ లక్ష్యం యుద్ధం కాదని, ప్రపంచ శాంతి, స్థిరత్వమే తమ విధానమని కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ స్పష్టం చేశారు. ఆపరేషన్ సింధూర్ యుద్ధం కాదని, భారత భద్రతకు ముప్పు వాటిల్లితే దేశం ఎలా స్పందిస్తుందో ప్రపంచానికి చూపించిన చర్య అని వ్యాఖ్యానించారు. ఇండో-పసిఫిక్ ప్రాంతంలో సముద్ర భాగస్వామ్యాన్ని మరింత బలోపేతం చేస్తున్నామని, భారత్ వ్యతిరేక శక్తులకు అవసరమైన సమయంలో తగిన సమాధానం ఇస్తామని రాజ్‌నాథ్ సింగ్ హెచ్చరించారు. భారత నౌకాదళంలో అత్యాధునిక యుద్ధ నౌక ఐఎన్ఎస్ మహేంద్రగిరి చేరడం దేశ భద్రతకు మరింత బలోపేతం చేస్తుందని అన్నారు. విశాఖపట్నంలో జరిగిన కార్యక్రమంలో ఐఎన్ఎస్ మహేంద్రగిరిని జాతికి అంకితం చేసిన ఆయన.. ఇది భారత నౌకాదళ శక్తిని మరింత పెంచే కీలక అడుగని పేర్కొన్నారు. భారత సముద్ర భద్రతలో విశాఖపట్నం కీలక కేంద్రంగా ఎదిగిందని రాజ్‌నాథ్ సింగ్ అన్నారు. ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు దూరదృష్టితో రాష్ట్రంలో ఏరోస్పేస్, రక్షణ రంగాలు వేగంగా అభివృద్ధి చెందుతున్నాయని ప్రశంసించారు. దేశ రక్షణ సామర్థ్యాన్ని మరింత పెంచే దిశగా అత్యాధునిక సాంకేతికతపై దృష్టి సారించామని తెలిపారు. ఐదో తరం ఎయిర్‌క్రాఫ్ట్ క్యారియర్ టెక్నాలజీతో పాటు అండర్‌వాటర్ టార్పెడో వ్యవస్థలను అభివృద్ధి చేస్తున్నామని చెప్పారు. కర్నూలును దేశంలో ప్రముఖ డ్రోన్ హబ్‌గా తీర్చిదిద్దే దిశగా చర్యలు కొనసాగుతున్నాయని వెల్లడించారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, అడ్వాన్స్‌డ్ షిప్ టెక్నాలజీ, డ్రోన్ టెక్నాలజీ, పూర్తి స్థాయి నిఘా వ్యవస్థలతో భారత సాయుధ దళాలను ఆధునికీకరిస్తున్నామని రాజ్‌నాథ్ సింగ్ తెలిపారు. కొత్త సాంకేతికత యుద్ధ అవసరాలకే కాకుండా విపత్తుల సమయంలో ఇతర దేశాలకు సహాయం చేయడంలో కూడా ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. మారిటైమ్ విజన్-2030 అమలులో భాగంగా సముద్ర రంగ అభివృద్ధికి ప్రత్యేక మారిటైమ్ డెవలప్‌మెంట్ ఫండ్ ఏర్పాటు చేశామని తెలిపారు. షిప్‌బిల్డింగ్ రంగంలో ఎంఎస్ఎంఈలు, స్టార్టప్‌లకు మరిన్ని అవకాశాలు కల్పిస్తున్నామని, భారత్‌ను ప్రపంచ స్థాయి షిప్‌బిల్డింగ్, మెరిటైమ్ ఇన్నోవేషన్ హబ్‌గా తీర్చిదిద్దడమే లక్ష్యమని చెప్పారు. ప్రపంచ స్థాయి మెరిటైమ్ ఎకోసిస్టమ్ నిర్మాణం దిశగా ప్రభుత్వం కట్టుబడి పని చేస్తోందని రాజ్‌నాథ్ సింగ్ వెల్లడించారు. భవిష్యత్తులో యుద్ధాలు కృత్రిమ మేధతో జరుగుతాయని, కానీ దేశం పట్ల ప్రేమ, సుశిక్షితులైన సైనికులు, సమర్థవంతమైన సైనిక సత్తా ఉంటే యుద్ధాలను గెలవవచ్చు అని రాజ్‌నాథ్ పేర్కొన్నారు. భారత రక్షణ, ఏరోస్పేస్ ఉత్పత్తిలో ఆంధ్రప్రదేశ్ కొత్త శక్తికేంద్రంగా మారినట్లు ఆయన తెలిపారు. కొత్త టెక్నాలజీలు, సంప్రదాయ విధానాలు ఒకటికి ఒకటి వేరు కాదు అని, ఒకదానిపై ఒకటి ఆధారపడుతాయని, పోటీపడుతాయని, సంప్రదాయ ఎ÷-లాట్‌ఫామ్‌లు లేకుండా.. కొత్త టెక్నాలజీ అసంపూర్ణంగా ఉంటుందని ఆయన అన్నారు. ఈ యుద్ధనౌకలోని 75 శాతానికి పైగా భాగాలు స్వదేశీ సాంకేతికతతో రూపొందించబడ్డాయి. భారతదేశంలోనే వీటిని తయారు చేశారు.భారతదేశ రూపకల్పన సామర్థ్యం, తయారీ నైపుణ్యం, ఆత్మనిర్భర్ భారత్ సంకల్పం, అలాగే దేశ రక్షణ రంగంలో పెరుగుతున్న స్వదేశీ శక్తికి ఇది సజీవ నిదర్శనమని మంత్రి రాజ్‌నాథ్ అన్నారు. మజగావ్ డాక్ షిప్‌బిల్డర్స్ లో ఐఎన్ఎస్ మహేంద్రగిరిని నిర్మించారు. బరాక్, బ్రహ్మోస్ వంటి అత్యాధునిక క్షిపణి వ్యవస్థలతో సముద్రం, గగనతలంలోని లక్ష్యాలను సమర్థవంతంగా ఛేదించే సామర్థ్యం ఈ యుద్ధనౌకకు ఉందని అధికారులు వెల్లడించారు.

# వియత్నాంలో విషాదం

**భారతీయులున్న పడవ మునక.. మృతుల్లో ఏపీ వాసులు**



**వియత్నాం :** వియత్నాం పర్యటనకు వెళ్లిన భారతీయులకు ఊహించని విషాదం ఎదురైంది. ఫూ క్వాక్ ద్వీపం సమీపంలో వీరు ప్రయాణిస్తున్న స్పీడ్ బోటు బోల్తా పడింది. ఈ ఘటనలో 15 మంది భారత టూరిస్టులు ప్రాణాలు కోల్పోయారు. మృతుల్లో తెలుగు రాష్ట్రాల వాసులున్నారు. కడప జిల్లాకు చెందిన డిస్ట్రిబ్యూటర్ శ్రీధర్, మచిలీపట్నంకు చెందిన జయశ్రీ మరణించారు. కడపకు చెందిన మరో డిస్ట్రిబ్యూటర్ నయీం ఒడ్డున ఉండటంతో ప్రాణాలు దక్కించుకున్నారు. ఓ మొబైల్ కంపెనీ భారత్ నుంచి తమ డిస్ట్రిబ్యూటర్లను కుటుంబాలను వియత్నాం ట్రిప్‌కు తీసుకెళ్లింది. మొత్తం 250 మంది ఈ యాత్రకు వెళ్లారు. వీరిలో ఏపీ నుంచి 35, తెలంగాణ నుంచి 40 మంది ఉన్నారు. ట్రిప్‌లో భాగంగా వీరు మూడు పడవల్లో సముద్రంలో విహార యాత్రకు వెళ్లారు. మధ్యాహ్నం ఒంటి గంట ప్రాంతంలో హాన్ మే రుట్ నుంచి అన్‌థోయ్ పోర్టుకు ఒక స్పీడ్ బోట్ బయల్దేరింది. అందులో 32 మంది భారతీయులు, నలుగురు సిబ్బంది ఉన్నారు. ఈ పడవ తీరానికి 400 మీటర్ల దూరంలో ఉండగా.. సముద్రంలో ఒక్కసారిగా బోల్తా పడింది. దీంతో ప్రయాణికులు నీటిలో మునిగిపోయారు. ప్రమాదం జరిగిన వెంటనే గమనించిన సమీపంలోని ఇతర పర్యాటక బోట్ల నిర్వాహకులు.. అక్కడకు చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. అయితే, బోటు పూర్తిగా తలకిందులు కావడంతో సహాయక చర్యలకు తీవ్ర ఆటంకం ఏర్పడినట్లు స్థానిక అధికారులు వెల్లడించారు. అటు అలల ఉధృతి కూడా తీవ్రంగా ఉండటంతో టూరిస్టులను కాపాడటం కష్టంగా మారింది. వీరిలో కొందరిని రెస్క్యూ సిబ్బంది రక్షించి ఆసుపత్రికి తరలించారు. మరికొందరు గల్లంతవ్వగా వారి కోసం సహాయక చర్యలు కొనసాగుతున్నాయి. వాతావరణ మార్పుల కారణంగానే బోటు మునిగినట్లు తెలుస్తోంది. ఈ ప్రమాదంపై వియత్నాంలోని భారత ఎంబసీ స్పందించింది. సహాయక చర్యలు కొనసాగుతున్నట్లు తెలిపింది. బాధితుల కోసం కంట్రోల్ రూమ్‌ను ఏర్పాటు చేసినట్లు పేర్కొంది.



# వెనెజువెలా విలయం..

**4 వేలు దాటిన మరణాలు**

**కారకాస్, జూలై 11 :** వెనెజువెలాలో జూన్ 24న సెకన్ల వ్యవధిలో సంభవించిన రెండు భారీ భూకంపాలు పెను విషాదాన్ని మిగిల్చాయి. ఈ విలయంలో ఇప్పటివరకు 4 వేలకు పైగా ప్రజలు ప్రాణాలు కోల్పోయినట్లు అక్కడి ప్రభుత్వం వెల్లడించింది. 16,740 మంది గాయపడగా.. భవన శిథిలాల కింద వేలాది మంది చిక్కుకున్నారు. ఇంకా చాలా మంది జాడ తెలియరాలేదు. దీంతో మృతుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉన్నట్లు అధికారులు చెబుతున్నారు. మరోవైపు శుక్రవారం కారకాస్‌లో 3.0 తీవ్రతతో భూకంపం సంభవించడంతో స్థానికంగా ఉన్న భవనాలను ఖాళీ చేయించి ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించారు. మరో వైపు దేశంలో కొనసాగుతోన్న భూకంప సహాయక చర్యల కోసం.. యూకే ఆంక్షల కింద విదేశాలలో స్తంభింపజేసిన సుమారు 30 టన్నుల వెనెజువెలా బంగారాన్ని విడుదల చేయాలని కింగ్ చార్లెస్ 3ని కోరినట్లు ఆ దేశ తాత్కాలిక అధ్యక్షురాలు డెల్సీ రోడ్రిగ్జ్ వెల్లడించారు.



# భారత్ మార్కెట్ మాత్రమేకాదు ఓ లాంచ్‌ప్యాడ్

**ప్రధాని నరేంద్రమోదీ**

**న్యూఢిల్లీ :** భారతదేశం అంతర్జాతీయ పెట్టుబడులకు ఒక గమ్యస్థానమని ప్రధాని నరేంద్రమోదీ పేర్కొన్నారు. తమ దేశం ప్రపంచ ఉత్పత్తులకు మార్కెట్‌గా మాత్రమే లేదని, ప్రపంచ వృద్ధికి ఒక ప్రయోగవేదిక అని అభివర్ణించారు. భారత్-న్యూజిలాండ్ వ్యాపార, క్రీడాభాగస్వామ్య కార్యక్రమంలో భాగంగా ప్రధాని మాట్లాడారు. ఇరుదేశాల మధ్య కుదిరిన స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం.. సాంకేతికత, సేవలు, రెండు దేశాల మధ్య రాకపోకలు, పెట్టుబడులు సహా పలు అంశాల్లో మరిన్ని అవకాశాలను సృష్టిస్తుందని వెల్లడించారు. ద్వైపాక్షిక వాణిజ్యం 2030 నాటికి రెట్టింపు అవుతుందని విశ్వాసం వ్యక్తం చేశారు. రానున్న 15 ఏళ్లలో భారత్‌లో 20 బిలియన్ డాలర్ల పెట్టుబడులు పెట్టేందుకు న్యూజిలాండ్ ముందుకు వచ్చింది. ఇది పెట్టుబడి మాత్రమే కాదని, భారత్ వృద్ధి ప్రయాణంలో భాగం కావాలనే నిబద్ధతకు నిదర్శనమని పేర్కొన్నారు. అలాగే భారత్‌లో అభివృద్ధి కార్యక్రమాలపై మాట్లాడారు. స్మార్ట్ సిటీస్ మిషన్ కింద 100 నగరాల్లో 8వేలకుపైగా ప్రాజెక్టులను అమలు చేస్తున్నామని పేర్కొన్నారు. పట్టణ రవాణా, నీరు, వ్యర్థాల నిర్వహణ వంటి రంగాల్లో భాగం కావాలని న్యూజిలాండ్ కంపెనీలను ఆహ్వానించారు. భారత్‌లో క్యాంపస్‌లు ఏర్పాటు చేయాలని ఆ దేశ యూనివర్సిటీలను కోరారు.




## ఆల్విన్ కాలనీ ఉమ్మడి డివిజన్ బీజేపీ అధ్యక్షుడిగా చిన్నగాలోల రాజు

**కూకట్‌పల్లి, జూలై 11 (జనంవార్త) :** శేరిలింగంపల్లి ఉమ్మడి ఆల్విన్ కాలనీ డివిజన్ భారతీయ జనతా పార్టీ అధ్యక్షుడి గా చిన్నగాలోల రాజు నియమితులయ్యారు. శుక్రవారం బీజేపీ పార్టీ రంగారెడ్డి అర్బన్ జిల్లా అధ్యక్షుడు వనివల్లి శ్రీనివాస్ రెడ్డి రాజు కి నియామక పత్రం అందజేశారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ రాజు లాంటి యువనాయకులు డివిజన్ లోని పార్టీ నాయకులతో కలిసి మెలిసి పని చేస్తూ రానున్న కార్పొరేషన్ ఎన్నికల్లో డివిజన్ లో బీజేపీ జెండా ఎగరవేయాలన్నారు. పార్టీ లో కష్టపడి పని చేసే ప్రతి ఒక్కరికి సముచిత స్థానం దక్కుతుందని వివరించారు. అధ్యక్షుడు గా నియమక పత్రం అందుకున్న అనంతరం రాజు మాటాడుతూ తన పై నమ్మకం ఉంచి డివిజన్ అధ్యక్షులు గా బాధ్యత అప్పగించినందుకు అధిష్టాననానికి ధన్యవాదములు తెలిపారు. డివిజన్ లో బీజేపీ జెండా ఎగరడవేసేలాతన వంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు.




## టూర్ ప్యాకేజీలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి

### డిప్యూటీ రీజినల్ మేనేజర్ పి. మహేష్

**ఘట్‌కేసర్ :** తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ (టీజీఎస్‌ఆర్టీసీ) ప్రవేశపెడుతున్న ఆధ్యాత్మిక టూర్ ప్యాకేజీలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆర్టీసీ సికింద్రాబాద్ రీజియన్ డిప్యూటీ రీజినల్ మేనేజర్ (ఆపరేషన్స్) పి. మహేష్ అన్నారు. చెంగిచెర్ల ఆర్టీసీ డిపో నుంచి గణగాపూర్‌- పండర్‌పూర్‌-తుల్జాపూర్‌-షిర్డీ పుణ్యక్షేత్రాలకు నిర్వహించిన సూపర్ లగ్జరీ టూర్ ప్యాకేజీ బస్సును ఆయన శనివారం జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా యాత్రికులకు శుభాకాంక్షలు తెలియజేస్తూ, టూర్ విజయవంతంగా సాగాలని ఆకాంక్షించారు. ఆర్టీసీ ప్రవేశపెట్టిన పుణ్యక్షేత్రాలకు సూపర్ లగ్జరీ ప్రత్యేక టూర్ ప్యాకేజీ బస్సులు అందుబాటులో ఉన్నట్లు తెలిపారు. చెంగిచెర్ల డిపో పరిధిలోని ఉద్యోగులు, భక్తులు, ప్రజలు తమ బంధువులు, మిత్రులు, కాలనీవాసులకు ఈ యాత్ర వివరాలను తెలియజేసి అధిక సంఖ్యలో టికెట్లు బుక్ చేసుకునేలా ప్రోత్సహించాలని కోరారు. భక్తులకు సౌకర్యవంతమైన ప్రయాణం కల్పించేందుకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు పేర్కొంటూ, ఈ ఆధ్యాత్మిక యాత్రను విజయవంతం చేయడంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఉప్పల్ డిపో మేనేజర్ శ్రీనివాస్, చెంగిచెర్ల డిపో అసిస్టెంట్ మేనేజర్ ఆనంద్ రావు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



## శ్రీ విష్ణు సహస్ర నామ పారాయణంతో మానసిక ప్రశాంతత

**కూకట్‌పల్లి, జూలై 11 :** కుత్బుల్లాపూర్ లోని శ్రీవేణుగోపాలస్వామి దేవాల యములో శనివారం శ్రీమద్భగవద్గీత శ్రీ విష్ణు సహస్ర నామ పారాయణ సహిత 39 /108వ హవన జ్ఞాన యజ్ఞ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. లోకకల్యా ణార్థం చేపట్టిన ఈ యజ్ఞ, పూజా కార్యక్రమానికి స్థానిక భక్తులు పాల్గొనాలని ఆలయ వేద పండితులు సూచించారు. శ్రీ విష్ణు సహస్ర నామ పారాయణం చేయడం వల్ల మానసిక ప్రశాంతతతో పాటు ఆధ్యాత్మిక చింతన లభిస్తుందన్నారు.

## 13న జాతీయ నులి పురుగుల నిర్మూలన దినోత్సవం

### జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ ఆనంద్



**మేడ్చల్ :** జాతీయ నులి పురుగుల దినోత్సవం నిర్వహణ పై జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్: ఆనంద్, శనివారం సంబంధిత అధికారులతో సమావేశమయ్యారు. అధికారులకు అవసరమైన మార్గదర్శకాలు జారీ చేశారు. ఈ కార్యక్రమాన్ని సమర్థవంతంగా అమలు చేయాలన్నారు. ఇందుకు ఆరోగ్య, విద్య, మహిళా శిశు సంక్షేమ శాఖల మధ్య సమన్వయం చేసుకోవాలన్నారు. కార్యక్రమం అమలులో బాగంగా, జూలై 13 జాతీయ క్రిమి నిర్మూలన దినోత్సవం, జూలై 20న మాప్ - అప్ డే నిర్వహించనున్నట్లు డాక్టర్: ఆనంద్ తెలిపారు. ఇందులో, 1 నుండి 19 సంవత్సరాల మధ్య వయస్సు గల పిల్లలు, యువతకు పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలు, సమాజ స్థాయిలో అల్బెండజోల్ మాత్రలను అందజేయనున్నట్లు ఆయన పేర్కొన్నారు. 1--2 సంవత్సరాల పిల్లలకు అర మాత్రను పొడి చేసి నీటితో ఇవ్వాలని, 2--3 సంవత్సరాల పిల్లలకు ఒక పూర్తి మాత్రను పొడి చేసి నీటితో ఇవ్వాలని ఆయన వివరించారు. జిల్లాలోని ప్రతి అర్హత కలిగిన బాలబాలిక ఈ కార్యక్రమం ద్వారా ప్రయోజనం పొందేలా చర్యలు తీసుకోవాలని వైద్య ఆరోగ్య శాఖ అధికారులు, మెడికల్ ఆఫీసర్స్, సిబ్బందిని డాక్టర్: ఆనంద్ ఈ సందర్భంగా ఆదేశించారు.

# సర్ ప్రక్రియను వేగవంతం చేయండి

- రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి
- కూకట్‌పల్లిలో సర్ ప్రక్రియను పరిశీలించిన సీ.ఈ.ఓ



**మేడ్చల్ :** "సర్" ప్రక్రియను వేగవంతం చేయాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి అన్నారు. ఎన్యుమరేషన్ ఫారాలు పూరించడంలో ఓటర్లకు అవగాహన కల్పించడంతోపాటు ప్రత్యేక సమగ్ర సవరణ సర్ ప్రక్రియను రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి, శనివారం కూకట్ పల్లి నియోజకవర్గం పరిధిలోని బాలాజీ నగర్ వార్డు కార్యాలయంలో నిర్వహిస్తున్న సర్ ప్రక్రియను మేడ్చల్ - మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ మను చౌదరితో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా సీ.ఈ.ఓ సుదర్శన్ రెడ్డి బిఎల్‌ఓ లు ఫారాల పంపిణీ కార్యక్రమం సజావుగా జరుగుచున్నదా, ఓటర్లు నింపిన ఫారాలను తిరిగి తీసుకుంటున్నారా అని అడిగి తెలుసుకున్నారు. వార్డు కార్యాలయంలో ఏర్పాటు చేసిన హెల్ప్ డెస్క్ ను పరిశీలించారు. ఫారాల ప్రక్రియను వేగవంతం చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఫారాలను ఏ విధంగా డిజిటలైజ్ చేస్తున్నారని, డిజిటలైజేషన్ ప్రక్రియను



ఆపరేటర్ల తో జాగ్రత్తగా చేయించాలన్నారు. బిఎల్వో లు ఓటర్ల నుండి తీసుకున్న ఫారాలను వెంట వెంటనే డిజిటలైజేషన్ చేయించాలన్నారు. అదే ప్రాంతంలోని అపార్ట్మెంట్ల లో బిఎల్వోలు నిర్వహిస్తున్న ఫారాల అప్లోడింగ్, పూరించిన ఫారాలను తీసుకునే ప్రక్రియను సీఈవో పరిశీలించారు. ఓటర్ల ఫారాలు పూరించడంలో వారికి అవగాహన కల్పిస్తూ అవసరమైన సహాయ సహకారాలను అందించాల న్నారు. అందుబాటులో లేని ఓటర్లను ఫోన్ల ద్వారా వివరాలు సేకరించి వారికి ఫారాలను అందించాలన్నారు. బిఎల్వో లకు కేటాయించిన ప్రాంతాలలో అందుబాటులో లేని వారి వివరాలను సూపర్వైజర్లకు తెలియజేయాలన్నారు. 2002లో లేని వారి ఫారాలు ఏ విధంగా పూరించాలి అనే అంశంపై సీఈవో వివరించారు. అనంతరం కె.పి.హెచ్.బి - 6 ఫేస్ లోని అపార్ట్మెంట్లో నిర్వహిస్తున్న సర్ ప్రక్రియలో సీఈవో ఓటర్లతో నేరుగా మాట్లాడి సందేహాలను నివృత్తి చేశారు. అనంతరం ఇండో ఫార్ప్యూన్ గ్రేటర్ కమ్యూనిటీలో ఏర్పాటు చేసిన హెల్ప్ డెస్క్ పరిశీలించి బిఎల్‌ఓ ల పనితీరును పర్యవేక్షించారు. అక్కడ ఉన్న ఓటర్ల సందేహాలకు సీఈవో నివృతి చేశారు. ఈ సర్ పర్యవేక్షణలో కూకట్ పల్లి జోనల్ కమిషనర్ మయాంక్ సింగ్, ఎమ్మార్వో అశోక్ , డీ.సీ ఆంజనేయులు సూపర్వైజర్లు, బిఎల్వోలు పాల్గొన్నారు.

## టీడబ్ల్యూజేఎఫ్ ఆధ్వర్యంలో.. 27న తెలంగాణ జర్నలిస్టుల 'ఛలో పార్లమెంట్'

### జంతర్ మంతర్‌లో ఒకరోజు ధర్నా

**హైదరాబాద్ :** కేంద్ర ప్రభుత్వం పరిష్కరించాల్సిన జర్నలిస్టుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరుతూ, ఈ నెల 27వ తేదీన "తెలంగాణ జర్నలిస్టుల ఛలో పార్లమెంట్" కార్యక్రమం చేపడుతున్నట్లు తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్(టీడబ్ల్యూజేఎఫ్) రాష్ట్ర అధ్యక్షుడు మామిడి సోమయ్య, ప్రధాన కార్యదర్శి తన్నీరు శ్రీనివాస్ లు తెలిపారు. పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు ఈనెల 20వ తేదీ నుంచి ప్రారంభమవుతున్నందున దీర్ఘకాలంగా పెండింగ్ లో ఉన్న జర్నలిస్టుల డిమాండ్ల సాధనకై ఈ కార్యక్రమం చేపట్టాలని నిర్ణయించినట్లు వారు శనివారం నాడిక్కడ మీడియాకు వెల్లడించారు. కేంద్ర ప్రభుత్వం పరిధిలో పరిష్కరించాల్సిన జర్నలిస్టుల రైల్వే రాయితీ పాస్ ల పునరుద్దరణ, జర్నలిస్టుల రక్షణ చట్టం, రిటైర్డ్ జర్నలిస్టులకు జాతీయ పెన్షన్ పథకం, జాతీయ మీడియా కమీషన్ ఏర్పాటు తదితర డిమాండ్ల పై 27న ఢిల్లీలోని పార్లమెంట్ వద్ద (జంతర్ మంతర్ లో) ఒక రోజు ధర్నా నిర్వహించనున్నట్లు తెలిపారు. ధర్నా అనంతరం పలువురు కేంద్ర మంత్రులు, పార్లమెంట్ సభ్యులను కలిసి తమ డిమాండ్లతో కూడిన వినతిపత్రాలను ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. ఛలో పార్లమెంట్ కార్యక్రమంలో రాష్ట్రంలోని అన్ని జిల్లాల నుంచి జర్నలిస్టులు, టీడబ్ల్యూజేఎఫ్ బాధ్యులు పాల్గొంటారని, అదేవిధంగా ఢిల్లీ, యూపీ తదితర రాష్ట్రాలకు చెందిన ఐఎఫ్ డబ్ల్యూజే నాయకులు కూడా ధర్నాలో పాల్గొంటారని తెలిపారు. దేశవ్యాప్తంగా జర్నలిస్టులకు రైలు ప్రయాణ చార్జీల్లో 50 శాతం రాయితీ కల్పిస్తూ దాదాపు పదిహేనేళ్ళ పాటు కొనసాగిన స్కీం ను కేంద్ర ప్రభుత్వం గత కోవిడ్ సందర్భంగా నిలిపివేసిందని, ఈ సదుపాయాన్ని తిరిగి పునరుద్దరించలేదని, దీంతో జర్నలిస్టులు ఇబ్బందులకు గురవుతున్నారని అన్నారు. జర్నలిస్టుల రైల్వే రాయితీ పాసుల సదుపాయాన్ని పునరుద్దరించాలని వారు డిమాండ్ చేశారు.




అదేవిధంగా దేశవ్యాప్తంగా మీడియా రంగం విస్తరించిన సందర్భంగా ప్రెస్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా స్థానంలో "నేషనల్ మీడియా కమీషన్"ను ఏర్పాటు చేయాలని కోరారు. రిటైర్డ్ జర్నలిస్టులకు కొన్ని రాష్ట్రాలలో ఆయా రాష్ట్ర ప్రభుత్వాలు పెన్షన్ స్కీం అమలు చేస్తున్నప్పటికి జాతీయ స్థాయిలో పెన్షన్ స్కీం లేదని, దేశవ్యాప్తంగా ఒకే పెన్షన్ విధానం ఉండేలా "జాతీయ పెన్షన్ పథకం" అమలు చేయాలని వారు కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. అనేక రాష్ట్రాలలో జర్నలిస్టులపై జరుగుతున్న దాడులు, హత్యలు, అక్రమ కేసులను నిలువరించేందుకు పార్లమెంట్ లో "జర్నలిస్టుల రక్షణ చట్టం" తీసుకురావాలని వారు డిమాండ్ చేశారు. ఎలక్ట్రానిక్, డిజిటల్ మీడియాకు పూర్తి స్థాయిలో చట్టబద్దత కల్పించాలని అన్నారు. ఈ డిమాండ్ల సాధనకై 27న జరిగే "ఛలో పార్లమెంట్" కార్యక్రమంలో జర్నలిస్టులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని వారు పిలుపునిచ్చారు.

## గర్భధారణల మధ్య సరైన వ్యవధి ఎంతో అవసరం

- మేడ్చల్ డీ.ఎం అండ్ హెచ్.ఓ డాక్టర్ కె.ఆనంద్
- ఈ నెల 18 వరకు అవగాహన సదస్సులు

**మేడ్చల్ :** ఆరోగ్యకరమైన మాతా, శిశు సంక్షేమం కోసం గర్భధారణల మధ్య సరైన వ్యవధి ఎంతో అవసరమని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్: ఆనంద్ అన్నారు. ప్రపంచ జనాభా దినోత్సవం --2026 సందర్భంగా కలెక్టరేట్ లోని వైద్య, ఆరోగ్య శాఖ కార్యక్రమంలో ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డా: కె. ఆనంద్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా డాక్టర్: ఆనంద్ మాట్లాడుతూ, ప్రణాళికాబద్ధమైన కుటుంబ వ్యవస్థ ద్వారా కుటుంబాల ఆరోగ్యం, ఆర్థిక స్థితి, సమాజ అభివృద్ధి సాధ్యమవుతుందన్నారు. ఈ ఏడాది ప్రపంచ జనాభా దినోత్సవం ఈ నెల 11నుంచి 18 వరకు ఆరోగ్యకరమైన మాతా, శిశు సంక్షేమం కోసం గర్భధారణల మధ్య సరైన వ్యవధి - అనాలోచిత గర్భధారణల నివారణ అనే నినాదంతో నిర్వహిస్తున్నట్లు ఆయన వెల్లడించారు. అలాగే, పిల్లల మధ్య సరైన అంతరం ఉంటే, కుటుంబాలు ఆరోగ్యంగా, సమర్థవంతంగా ఎదుగుతాయనే సందేశాన్ని ప్రజల్లో విస్తృతంగా చాటిచెప్పాల్సిన అవసరం ఉందన్నారు. పెరుగుతున్న జనాభా వనరులపై ఒత్తిడిని పెంచి ఆహారం, తాగునీరు, ఆరోగ్యం, విద్య వంటి మౌలిక అవసరాలపై ప్రభావం చూపుతుందన్నారు. కుటుంబ నియంత్రణ, గర్భనిరోధక సాధనాల వినియోగం, మాతా, శిశు ఆరోగ్య సేవలపై ప్రజల్లో



మరింత అవగాహన కల్పించాలని డాక్టర్: ఆనంద్ పిలుపునిచ్చారు. ప్రపంచ జనాభా దినోత్సవం సందర్భంగా జిల్లా వ్యాప్తంగా కుటుంబ సంక్షేమ కార్యక్రమాలపై అవగాహన కార్యక్రమాలు, అర్హులైన దంపతుల సన్మానం, కుటుంబ నియంత్రణ సేవల ప్రోత్సాహం, ఆరోగ్య విద్యా కార్యక్రమాలు, ర్యాలీలు నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా వైద్య శాఖలో విశిష్ట సేవలు అందించిన ఉద్యోగులకు మెరిట్ సర్టిఫికెట్లు, మెమెంటోలు, ఒక్క ఆడపిల్ల తో కుటుంబ నియంత్రణ చేసుకున్న దంపతులకు క్యాష్ ప్రైజ్ రూ. 1,000 అందజేసి సత్కరించారు. ఈ కార్యక్రమంలో మల్కాజిగిరి, కీసర డివిజన్ ఉప జిల్లా వైద్యాధికారులు డాక్టర్: లావణ్య , డాక్టర్: గీత, జిల్లా ప్రోగ్రామ్ అధికారులు డాక్టర్: గీత, డాక్టర్: శ్రీదేవి, డాక్టర్: నాగరాజు, డా: పవన్ రెడ్డి, డా: కౌశిక్, డెమో ఆఫీసర్ వసంత రెడ్డి, ఉషారాణి, విజయ్ కుమార్, జిల్లాలోని పీహెచ్‌సీలు, యూపీహెచ్‌సీల వైద్యాధికారులు, ఆరోగ్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## జవహర్ నగర్ నుంచి డంపింగ్ యార్డ్ ఎత్తివేయాలి

### మహిళా సమాఖ్య డిమాండ్

**మేడ్చల్ :** జవహర్ నగర్ లో డంపింగ్ యార్డ్ ను సత్వరమే ఎత్తివేయాలని మహిళా సమాఖ్య మేడ్చల్ జిల్లా సమితి డిమాండ్ చేసింది. జిల్లా మహిళా సమాఖ్య ముఖ్య కార్యకర్తల సమావేశం శనివారం ఇక్కడ ఈ.సి.ఐ.ఎల్ లో జరిగింది. ఈ సమావేశానికి వి. హైమవతి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా హైమవతి మాట్లాడుతూ, జవహర్ నగర్ నుంచి డంపింగ్ యార్డ్ ఎత్తివేతకు ఉద్యమాన్ని ఉధృతం చేయవలసిన అవసరం ఉందని, అందుకు గాను మహిళలను సమాయత్తం చేయాలని కార్యకర్తలను కోరారు. జిల్లాలో దరఖాస్తు చేసుకున్న ఒంటరి మహిళలకు ప్రభుత్వం వెంటనే




పింఛనులు మంజూరు చేయాలని కోరారు. సమావేశంలో రొయ్యల గిరిజ, సి.హెచ్.మాధవి, ప్రమీల, స్వరూప తదితరులు పాల్గొన్నారు.




## విద్యార్థి దశ నుంచే నాయకత్వ లక్షణాలు అలవర్చుకోవాలి

### ఏసీపీ గోపాల కృష్ణమూర్తి

**సికింద్రాబాద్ :** విద్యార్థులు విద్యాభ్యాసంతో పాటు నాయకత్వ లక్షణాలను పెంపొందించుకుని సమాజంలో ఆదర్శప్రాయంగా ఎదగాలని బేగంపేట్ అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ పోలీస్ (ఏసీపీ) గోపాల కృష్ణమూర్తి అన్నారు. శనివారం బోయినపల్లిలోని సీఎంఆర్ హైస్కూల్‌లో నిర్వహించిన ఇన్వెస్టిట్యూర్ వేడుకలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. ఈ కార్యక్రమానికి సీఎంఆర్ పాఠశాలల సెక్రటరీ సౌజన్య రెడ్డి, డైరెక్టర్ ఎస్.కె. రెడ్డి గౌరవ అతిథులుగా హాజరై కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎన్‌సీసీ విద్యార్థులు నిర్వహించిన మార్చ్‌పాస్ట్ ద్వారా ఏసీపీ గోపాల కృష్ణమూర్తికి గౌరవ వందనం సమర్పించారు. అనంతరం పాఠశాల హెడ్ బాయ్, హెడ్ గర్ల్‌తో పాటు వివిధ విద్యార్థి నాయకులుగా ఎన్నికైన విద్యార్థులకు బ్యాడ్జీలు, ట్రోఫీలు ప్రదానం చేసి అభినందించారు. అలాగే పాఠశాల స్థాయిలో అత్యుత్తమ ప్రతిభ కనబర్చిన జట్టుకు విజేత ట్రోఫీని అందజేశారు. ఈ సందర్భంగా ఏసీపీ మాట్లాడుతూ, విద్యార్థి దశలోనే నాయకత్వ లక్షణాలు అలవర్చుకుంటే భవిష్యత్తులో ఎదురయ్యే సవాళ్లను ధైర్యంగా ఎదుర్కొనే సామర్థ్యం పెరుగుతుందని అన్నారు. నాయకత్వం కేవలం రాజకీయ రంగానికే పరిమితం కాదని, విద్య, ఉద్యోగం, సేవా కార్యక్రమాలు, సామాజిక రంగం సహా ప్రతి విభాగంలోనూ వ్యక్తిత్వ వికాసానికి దోహదపడుతుందని పేర్కొన్నారు. విద్యార్థి నాయకులు తమ తోటి విద్యార్థులకు ఆదర్శంగా నిలుస్తూ బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు. ఇలాంటి ఇన్వెస్టిట్యూర్ కార్యక్రమాలు విద్యార్థుల్లో క్రమశిక్షణ, బాధ్యత, నాయకత్వ నైపుణ్యాలను పెంపొందించడంలో కీలకపాత్ర పోషిస్తాయని తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్స్ సునీత, నుస్రత్, అధ్యాపక బృందం, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.




## తల్లిదండ్రులే తొలి ట్రాఫిక్ గురువులు

### 'అరైవ్ అలైవ్' కార్యక్రమంలో భాగంగా ఆల్వాల్‌లో తల్లిదండ్రులకు ట్రాఫిక్ అవగాహన

**సికింద్రాబాద్ :** రోడ్డు భద్రతపై అవగాహన ఇంటి నుంచే ప్రారంభం కావాలని, తల్లిదండ్రులే పిల్లలకు తొలి ట్రాఫిక్ గురువులని ట్రిముల్గెర్రీ ట్రాఫిక్ అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ పోలీస్ జి. శంకర్ రాజు అన్నారు. మల్కాజిగిరి పోలీస్ కమిషనర్ బి. సుమతి, ఐపీఎస్ ఆదేశాలు, ట్రాఫిక్--× డీసీపీ కె. రాహుల్ రెడ్డి, ఐపీఎస్ మార్గదర్శకత్వంలో శనివారం ఆల్వాల్ గ్రీన్‌ఫీల్డ్స్ కాలనీలోని శ్రీ నారాయణ విద్యా భవన్‌లో 'అరైవ్ అలైవ్' కార్యక్రమంలో భాగంగా తల్లిదండ్రులకు ట్రాఫిక్ అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, అతివేగం, మద్యం సేవించి వాహనాలు నడపడం, మైనర్లతో డ్రైవింగ్ చేయించడం, ట్రిపుల్ రైడింగ్, వాహనం నడుపుతూ మొబైల్ ఫోన్ వినియోగించడం వంటి నిర్లక్ష్యాలు ప్రాణాంతక ప్రమాదాలకు దారితీస్తాయని హెచ్చరించారు. హెల్మెట్, సీటుబెల్ట్ వినియోగం, ట్రాఫిక్ సిగ్నళ్లకు కట్టుబడి ఉండటం, లేన్ క్రమశిక్షణ పాటించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని వివరించారు. మైనర్ డ్రైవింగ్‌పై ప్రత్యేకంగా అవగాహన కల్పిస్తూ, చట్టబద్ధమైన వయస్సు రాకముందే పిల్లలకు వాహనాలు ఇవ్వొద్దని తల్లిదండ్రులను కోరారు. పిల్లలు తల్లిదండ్రుల ప్రవర్తననే అనుసరిస్తారని, పెద్దలు ట్రాఫిక్ నియమాలను కచ్చితంగా పాటిస్తే చిన్నారులు కూడా అదే అలవాటు చేసుకుంటారని చెప్పారు. ట్రాఫిక్ క్రమశిక్షణ ఇంటి నుంచే ప్రారంభమవుతుంది, తల్లిదండ్రుల ప్రవర్తనే పిల్లల భవిష్యత్తుకు పునాది, "హెల్మెట్, సీటు బెల్ట్ కుటుంబ భద్రతకు రక్షణ కవచం","బాధ్యతాయుతమైన తల్లిదండ్రులే బాధ్యతాయుతమైన పౌరులను తీర్చిదిద్దగలరు" అనే సందేశాలను ఈ సందర్భంగా తల్లిదండ్రులకు వివరించారు. కార్యక్రమంలో ట్రిముల్గెర్రీ ట్రాఫిక్ ఏసీపీ జి. శంకర్ రాజు, శ్రీ నారాయణ విద్యా భవన్ అధ్యక్షులు పి. బి. రవీంద్రనాథన్, జనరల్ సెక్రటరీ ఌ కరస్పాండెంట్ ఎం. పద్మనాభన్, ఎడ్యుకేషనల్ సెక్రటరీ రీనా విజయచంద్రన్, ప్రిన్సిపాల్ కె. వి. రాఘవాచార్యులు, ఉపాధ్యాయులు, సిబ్బంది, పెద్ద సంఖ్యలో తల్లిదండ్రులు పాల్గొన్నారు. ట్రాఫిక్ నియమాలు, రోడ్డు భద్రతపై తల్లిదండ్రులు తమ సందేహాలను నివృత్తి చేసుకోగా, ట్రాఫిక్ పోలీసుల అవగాహన కార్యక్రమాన్ని అభినందించారు. కార్యక్రమానికి పాఠశాల యాజమాన్యం, తల్లిదండ్రుల నుంచి విశేష స్పందన లభించింది.



## సర్‌ను పర్యవేక్షించిన అదనపు కలెక్టర్ విజయేందర్ రెడ్డి

**మేడ్చల్ :** ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియలో భాగంగా ఎన్యుమరేషన్ ఫారాలు పూరించడంలో ఓటర్లకు అవగాహన కల్పించడం బిఎల్‌ఓ ల బాధ్యతని మేడ్చల్ - మల్కాజిగిరి జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్ రెడ్డి అన్నారు. శనివారం అదనపు కలెక్టర్ ఘట్కేసర్ మండలంలోని ఎదులాబాద్ ఎన్ఎస్సీ నగర్ లో ఏర్పాటు చేసిన ఎన్యూమరేషన్స్ సెంటర్లలో నిర్వహిస్తున్న సర్ ప్రక్రియను కీసర ఆర్డీవో వెంకటరెడ్డి తో కలిసి అదనపు కలెక్టర్ విజయేందర్ రెడ్డి పర్యవేక్షించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ, ఫారాల పంపిణీ ప్రక్రియను వేగవంతం చేయాలన్నారు. స్వీకరించిన ఫారాలను వెంట వెంటనే డిజిటలైజ్ చేయాలని కూడా ఆదేశించారు. ఫారాలు పూరించడంలో ఓటర్లకు పూర్తి అవగాహన కల్పించాల్సిన బాధ్యత బిఎల్వోలదేనని స్పష్టం చేశారు. ఓటర్ల సందేహాలను నివృత్తి చేయాలని సూచించారు. ఎన్యుమరేషన్ ఫారాలను పూరించడంలో బి.ఎల్.వో లు ఓటర్లకు సహకరించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఘట్కేసర్ ఎమ్మార్వో చంద్రశేఖర్, ఏఈఆర్వోలు, బిఎల్వో లు పాల్గొన్నారు.



## ఫార్చ్యూన్ జాబితాలో నారా బ్రహ్మణి

- మోస్ట్ పవర్‌ఫుల్ విమెన్ 2026 అవార్డు అందచేత
- అభినందనలు తెలిపిన చంద్రబాబు, నారా లోకేశ్

**అమరావతి, జూలై 11 :** హెరిటేజ్ ఫుడ్స్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ నారా బ్రాహ్మణికి అంతర్జాతీయ స్థాయిలో అరుదైన గుర్తింపు దక్కింది. ప్రముఖ బిజినెస్ మ్యాగజైన్ 'ఫార్చ్యూన్ ఇండియా' ప్రకటించిన మోస్ట్ పవర్‌ఫుల్ విమెన్ – 2026 జాబితాలో ఆమె చోటు సంపాదించారు. భారతదేశ ఆర్థిక వృద్ధిలో కీలక పాత్ర పోషిస్తున్న మహిళా పారిశ్రామికవేత్తల జాబితాలో బ్రాహ్మణి నిలవడం విశేషం. దిల్లీలో జరిగిన ఫార్చ్యూన్ ఇండియా 'మోస్ట్ పవర్‌ఫుల్ విమెన్ 2026' సదస్సులో బ్రాహ్మణికి ఈ అవార్డును అందజేశారు. హెరిటేజ్ ఫుడ్స్ ప్రస్థానంలో రైతుల పాత్ర ఎనలేనిదని, పాల ఉత్పత్తిలో నూతన సాంకేతికతను జోడిస్తూనే.. అన్నదాతల జీవనోపాధిని మెరుగుపరచడమే తమ ప్రధాన లక్ష్యమని ఈ సందర్భంగా బ్రాహ్మణి స్పష్టం చేశారు. ఈ అరుదైన గుర్తింపును హెరిటేజ్ ఫుడ్స్ కుటుంబానికి, రైతులకు, సంస్థ ఉద్యోగులకు అంకిత మిస్తున్నట్లు ప్రకటించారు. తన భార్య సాధించిన ఘనతపై మంత్రి నారా లోకేశ్ హర్షం వ్యక్తం చేశారు. ఫార్చ్యూన్ ఇండియా ప్రకటించిన 100 మంది అత్యంత ప్రభావవంతమైన మహిళల జాబితాలో బ్రాహ్మణి నిలవడం తమకు ఎంతో గర్వకారణమన్నారు. ఇలాగే ప్రతిభను చాటుతూ, నాయకత్వ లక్షణాలతో మరిన్ని అవరోధాలను అధిగమించాలని ఆకాంక్షించారు. 'ఫార్చ్యూన్ ఇండియా' విడుదల చేసిన 'మోస్ట్ పవర్‌ఫుల్ విమెన్' జాబితాలో నారా బ్రాహ్మణికి చోటు దక్కడం పట్ల ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆమెకు సోషల్ మీడియా వేదికగా అభినందనలు తెలిపారు. బ్రాహ్మణి ఈ ప్రతిష్ఠాత్మక జాబితాలో స్థానం సంపాదించడం ఎంతో అభినందనీయమని సీఎం పేర్కొన్నారు. ఇది ఆమె నాయకత్వం, దూరదృష్టి, అంకితభావానికి దక్కిన అరుదైన గుర్తింపని కొనియాడారు. బ్రాహ్మణి సాధించిన ఈ ఘనత యువతులకు, ముఖ్యంగా తెలుగు అమ్మాయిలకు స్ఫూర్తిగా నిలుస్తుందని అన్నారు. భవిష్యత్‌లో కూడా బ్రాహ్మణి మరిన్ని విజయాలు సాధిస్తూ, కొత్త మైలురాళ్లను అధిరోహించాలని ఆకాంక్షిస్తున్నట్లు సీఎం చంద్రబాబు తన సందేశంలో తెలిపారు.

## సాయికృష్ణ విచారణలో అడ్డంకిగా నిబంధనలు

### సుప్రీంలో పిటిషన్ దాఖలు చేసిన ప్రభుత్వం

**అమరావతి,జూలై11 :** సాయికృష్ణ లాకప్ డెత్ కేసు విచారణకు సంబంధించి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. కృష్ణలంక మాజీ సీఐ నాగరాజు పోలీస్ కస్టడీపై హైకోర్టు ఇచ్చిన తీర్పును సిట్ సవాలు చేస్తూ సుప్రీంకోర్టును ఆశ్రయించింది. సీఐ నాగరాజు కస్టడీ విచారణపై హైకోర్టు విధించిన కఠిన నిబంధనలపై ప్రభుత్వం అభ్యంతరం వ్యక్తం చేసింది. నిందితుడి ట్రాన్సిట్ సమయంలో పూర్తి నిడివి వీడియో రికార్డింగ్ చేయాలన్న షరతును సిట్ అధికారులు వ్యతిరేకిస్తున్నారు. నిరంతర వీడియో నిఘా వల్ల దర్యాప్తు గోప్యత దెబ్బతినే ప్రమాదం ఉందని అధికారులు అంటున్నారు. సాయికృష్ణ మృతదేహం అన్వేషణ, సీన్ రికన్‌స్ట్రక్షన్‌కు హైకోర్టు కండీషన్లు అడ్డంకిగా మారాయని పేర్కొంటూ ఏపీ ప్రభుత్వం సుప్రీంకోర్టులో ఈ పిటిషన్ దాఖలు చేసింది. నిందితుడిని ఎటువంటి కఠిన షరతులు లేకుండా విచారించేందుకు అనుమతించాలని అత్యున్నత న్యాయస్థానాన్ని కోరింది. కాగా, విజయవాడలో సంచలనం సృష్టించిన కస్టోడియల్ డెత్ కేసులో నిజాలు రాబట్టేందుకు సుప్రీంకోర్టు తీర్పు కీలకంగా మారింది. సిట్ వేసిన ఈ పిటిషన్ వచ్చే వారం విచారణకు వచ్చే అవకాశం ఉంది.




## ఓటిటి సినిమాలకు కూడా సెన్సార్ షిప్

### తాజా పరిణామాలతో కేంద్రం యోచన

**న్యూఢిల్లీ, జూలై 11 :** భారతదేశంలో నెట్‌ఫ్లిక్స్, అమెజాన్ ప్రైమ్, డిస్నీ హాట్‌స్టార్ వంటి ప్రముఖ ఓటీటీ ప్లాట్‌ఫామ్‌లలో వచ్చే సినిమాలు, వెబ్ సిరీస్‌లపై కేంద్ర ప్రభుత్వం నిఘా పెంచాలని చూస్తుంది. ప్రస్తుతం అమల్లో ఉన్న సమాచార సాంకేతిక రూల్స్, 2021 స్థానంలో సరికొత్త కఠిన నిబంధనలను తీసుకురావడానికి కసరత్తులు జరుగుతున్నట్లు సమాచారం. ప్రస్తుత విధానం ప్రకారం, ఓటీటీ కంటెంట్‌ను థియేటర్లలో విడుదలయ్యే సినిమాల మాదిరిగా సెంట్రల్ బోర్డ్ ఆఫ్ ఫిల్మ్ సర్టిఫికేషన్ ముందస్తుగా పరిశీలించి ఎటువంటి సర్టిఫికేట్ ఇవ్వదు. ఇదంతా ఐటీ రూల్స్, 2021 పరిధిలోని డిజిటల్ మీడియా ఎథిక్స్ కోడ్ ప్రకారమే నడుస్తోంది. దీనివల్ల ఆయా ప్లాట్‌ఫామ్‌లు తమ కంటెంట్‌ను వయస్సు ఆధారంగా విభజించి, కేవలం స్వీయ నియంత్రణ మాత్రమే పాటిస్తున్నాయి. అయితే, ఇటీవల కొన్ని ఓటీటీ సినిమాలు, వెబ్ సిరీస్‌లలో మితిమీరిన బోల్డ్ సీన్లు, బూతులు మరియు వివాదాస్పద రాజకీయ, సామాజికాంశాలు ఎక్కువవుతున్నాయనే ఫిర్యాదులు ప్రభుత్వానికి పెద్ద ఎత్తున అందాయి. తాజా ఉదాహరణగా, పంజాబీ నటుడు దిల్జీత్ దోసాంజ్ నటించిన 'సత్లుజ్' సినిమా నిలిచింది. ఈ చిత్రం థియేట్రికల్ విడుదల కోసం సెన్సార్ బోర్డ్ వద్దకు వెళ్లినప్పుడు ఏకంగా 120కి పైగా కట్స్ చెప్పారు. అందుకు నిర్మాతలు నిరాకరించి, నేరుగా ఓటీటీ వేదికపై విడుదల చేసినప్పటికీ, వివాదం రేగడంతో కేవలం 48 గంటల్లోనే ఆ సినిమాను తొలగించాల్సి వచ్చింది. ఇలాంటి ఘటనల నేపథ్యంలోనే, థియేటర్ల కోసం కాకుండా నేరుగా డిజిటల్ వేదికలపై వచ్చే కంటెంట్‌కు కూడా ముందస్తు పర్యవేక్షణ ఉండాలని ప్రభుత్వం గట్టిగా నిర్ణయించుకుంది. ఇందులో భాగంగానే ఓటీటీలో నేరుగా విడుదలయ్యే చిత్రాలకు కూడా సెన్సార్ సర్టిఫికేషన్ తప్పనిసరి చేయాలనే ప్రతిపాదనను పరిశీలిస్తున్నారు. కేవలం సినిమాలకే కాకుండా, ఓటీటీ వెబ్ సిరీస్‌లను కూడా ఈ సెన్సార్ పరిధిలోకి తీసుకురావాలా లేదా అనే అంశంపై వివిధ వర్గాలతో మరియు ఐటీ శాఖతో కేంద్ర సమాచార ప్రసార మంత్రిత్వ శాఖ ప్రస్తుతం కీలక చర్చలు జరుపుతోంది. ఒకవేళ ఈ నిబంధనలు కనుక అమల్లోకి వస్తే, డిజిటల్ కంటెంట్ క్రియేటర్ల సృజనాత్మక స్వేచ్ఛపై తీవ్ర ప్రభావం పడే అవకాశం ఉందని పరిశ్రమ వర్గాలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి.

# ఉన్మాది నరమేధం



### షాబాద్ పరిధిలో కనీవినీ ఎరుగని దారుణం

### ఆరుగురుని దారుణంగా హత్య చేసిన సైకో

### పోక్సో కేసు పెట్టారని ముగ్గురి హత్య

- విచిత్రంగా భార్యా ఇద్దరు పిల్లల నరికివేత
- అనంతరం గ్రామం నుంచి పరార్
- నిందితుడు కోసం గాలిస్తున్న పోలీసులు
- సైకోను పట్టుకోవాలంటూ గ్రామస్తుల ఆందోళన

రంగారెడ్డి, జూలై 11 : రంగారెడ్డి జిల్లాలోని షాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలో దారుణం జరిగింది. పోక్సో కేసులో జైలు నుంచి వచ్చిన ఓ కిరతాకుడు నరమేధం సృష్టించాడు. ఏకంగా ఆరుగురిని దారుణంగా నరికి చంపాడు. ఆరుగురు హత్యకు గురైన ఘటన కలకలం సృష్టించింది. షాబాద్ మండల కేంద్రంలోని దైవాలగూడలో శుక్రవారం అర్ధరాత్రి ఈ ఘటన చోటుచేసుకుంది. పోక్సో కేసు పెట్టారనే కక్షతో రాజ్‌కుమార్ (28) అనే దుర్మార్గుడు ఈ ఘాతు కానికి ఒడిగట్టాడు. దైవాలగూడకు చెందిన పార్వతి రాజ్ కుమార్ కట్టుకున్న భార్య, ఇద్దరు కుమారులతో పాటు, తనపై పోక్సో కేసు పెట్టిన మైనర్ బాలిక, ఆమె తల్లి లక్ష్మీ, నాయనమ్మ రుక్కమ్మలను కత్తితో నరికి చంపాడు. మొదట షాబాద్ పీఆర్‌ఆర్ స్టేడియం సమీపంలో ఉన్న మైనరు బాలిక (17)ఇంట్లోకి ప్రవేశించి.. ఆమెను బలవంతంగా లాక్కెళ్లే క్రమంలో బాలిక తల్లి, నాయనమ్మ అడ్డు పడ్డారు. నిందితుడు వారిద్దరినీ కత్తితో పొడిచి చంపాడు. అనంతరం బాలికను దైవాల గూడ సమీపంలోని అఖిల్ సాగర్ చెరువు సమీపంలోకి తీసుకెళ్లి పీక కోసి హత్య చేశాడు. అనంతరం దైవాలగూడలోని తన ఇంటికొచ్చి భార్య సరిత (33)తో పాటు ఇద్దరు కుమారులు పరీక్షిత్ (4), దైవీక్షిత్ (2)లను కత్తితో పీకలు కోసి దారుణంగా హతమార్చాడు. ఆ తర్వాత తండ్రి అరుణ్ కుమార్‌కు ఫోన్ చేసి నేనే ఆరుగురిని చంపాను, నేను కూడా చనిపోతున్నానని చెప్పాడు. దీంతో అరుణ్‌కుమార్ పోలీసులకు సమాచారం అందించారు. షాబాద్ పోలీసులు ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఘటనాస్థలిని ఫ్యూచర్‌సిటీ సీపీ తరుణ్ జోషి పరిశీలించారు. బాలికను వేధించాడని ఆమె తల్లి మే 16న పోలీసులకు ఫిర్యాదు చేయడంతో పోక్సో కేసు



నమోదు చేసి రాజ్‌కుమార్‌ను అరెస్టు చేశారు. బెయిల్‌పై తిరిగొచ్చిన నిందితుడు.. అర్ధరాత్రి ఈ దారుణానికి పాల్పడ్డాడు. నిందితుడు రాజ్‌కుమార్.. ఏడేళ్ల క్రితం సరితను ప్రేమించి పెళ్లి చేసుకున్నాడు. అయినా భార్యను ఇద్దరు పిల్లలను కూడా చంపడం అతని సైకో మనస్తత్వానికి నిదర్శనంగా చూడాలి. ఆరుగురి హత్య కేసులో మృతుల బంధువుల ఆందోళనతో షాబాద్‌లో ఉద్రిక్తత నెలకొంది. నిందితుడిని తమకు అప్పగించాలంటూ షాబాద్–కంది రహదారిపై బైఠాయించి ధర్నాకు దిగారు. రాజ్‌కుమార్‌ను వెంటనే అరెస్ట్ చేయకపోతే మరొకరి ప్రాణం తీస్తాడని ఆగ్రహం వ్యక్తం చేశారు. నిందితుడు రాజ్‌కుమార్ ప్రస్తుతం పరారీలో ఉన్నాడని, ఏడు ప్రత్యేక బృందాలతో గాలిస్తున్నామని ఫ్యూచర్‌సిటీ సీపీ తరుణ్ జోషి తెలిపారు. నిందితుడు భార్య, పిల్లలను కూడా హత్య చేయడం పోలీసులను సైతం ఆశ్చర్యానికి గురి చేసిందని సీపీ తెలిపారు.



## షాబాద్ మండలంలో ఉద్రిక్తత

**రంగారెడ్డి, జూలై 11 :** పోక్సో కేసు పెట్టారనే కక్షతో రంగారెడ్డి జిల్లా షాబాద్‌లో ఆరుగురిని హత్య చేసిన ఘటన రాష్ట్రవ్యాప్తంగా సంచలనంగా మారింది. ఈ క్రమంలో బాధిత కుటుంబసభ్యులను పరామర్శించేందుకు వెళ్తున్న బీఆర్‌ఎస్ నాయకులను పోలీసులు అరెస్టు చేశారు. షాబాద్ మండలం దైవాలగూడకు మాజీ మంత్రి, ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డిని చేవెళ్ల వద్ద పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఆర్‌ఎస్ ప్రవీణ్ కుమార్, పట్నం నరేందర్ రెడ్డిని శంకర్‌పల్లి వద్ద అదుపులోకి తీసుకున్నారు. ఇక పటోళ్ల కార్తీక్ రెడ్డిని హౌస్ అరెస్టు చేశారు. 2018లో సరిత అనే మహిళను రాజ్‌కుమార్ ప్రేమించి పెళ్లి చేసుకున్నాడు. వీరికి ఇద్దరు పిల్లలు. అయినప్పటికీ మరో మైనర్ బాలికను ప్రేమ పేరుతో రాజ్‌కుమార్ వేధించసాగాడు. ఈ విషయం తెలిసిన బాలిక తల్లి ఆమెను కాలేజీకి పంపించకుండా ఇంట్లోనే ఉంచింది. ఈ క్రమంలో ఒకసారి పరీక్షల కోసం బాలిక కాలేజీకి వెళ్లినప్పుడు.. ఆమెను బలవంతంగా లాక్కెళ్లేందుకు యత్నించాడు. అప్పుడు ఆమె తల్లి చాకచక్యంగా వ్యవహరించి నిందితుడి నుంచి బాలికను తప్పించింది. అప్పటి నుంచి బాలికపై రాజ్‌కుమార్ పలుమార్లు బెదిరింపులకు పాల్పడినట్లు స్థానికులు చెబుతున్నారు. మీ నాన్నను ఎలా చంపేశారో.. మిమ్మల్ని కూడా అలాగే చంపేస్తానని బాధితురాలి కుటుంబాన్ని గతంలో బెదిరించాడని అంటున్నారు. అయితే నిందితుడు బహిరంగంగా తిరుగుతూ బెదిరింపులకు పాల్పడుతున్నా.. పోక్సో కేసు నమోదైనప్పటికీ బాలికకు ఎలాంటి రక్షణ కల్పించలేదని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పోలీసుల నిర్లక్ష్యమే ఈ ఉదందతానికి ప్రధాన కారణమని ఆరోపిస్తున్నారు. గతంలో భూతగాదాలో ఇద్దరిని బెదిరించినందుకు రాజ్‌కుమార్‌పై గతంలోనే రెండు ఎఫ్‌ఐఆర్‌లు నమోదైనట్లు సమాచారం. మరోవైపు పోక్సో కేసులో కేవలం ఏడేళ్లు మాత్రమే శిక్షపడేలా తేలికపైన సెక్షన్లను పోలీసులు జత చేయడం కూడా ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది. దీనివల్ల కేవలం రూ.20 వేల పూచీకత్తుతో రెండు నెలల్లోనే బెయిల్ వచ్చిందని.. దీనివల్లే బయటకు వచ్చిన రాజ్ కుమార్ ఆరుగురిని కిరాతంగా హత్య చేశాడని స్థానికులు మండిపడుతున్నారు.

## నాన్న మరణానికి ప్రతీకారం తీర్చుకుంటా: మొజ్తబా

**టెహ్రాన్ :** అమెరికా–ఇరాన్ మధ్య మరోసారి తీవ్ర ఉద్రిక్తతలు చోటుచేసుకున్న వేళ ఇరాన్ సుప్రీం లీడర్ మొజ్తబా ఖమేనీ స్పందించారు. తన తండ్రి ఆయతుల్లా అలీ ఖమేనీ మరణానికి ప్రతీకారం తీర్చుకుంటానని ప్రతిజ్ఞ చేశారు. బాధ్యులైన వారు పర్యవసానాలను ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరించారు. ఇది తమ దేశవ్యాప్తంగా ఉన్న డిమాండ్ అని.. దానిని కచ్చితంగా నెరవేరుస్తానని అన్నారు. ఈ మేరకు ఆయన టెలిగ్రామ్‌లో ఓ సందేశాన్ని విడుదల చేశారు. "మా నాయకుడితో పాటు అమరులైన వారందరి కోసం.. ఆ హంతకులపై ప్రతీకారం తీర్చుకుంటాం" అని అందులో పేర్కొన్నారు. అయితే, ఈ విషయం తన నాయకత్వంపై లేదా ఇతర అధికారుల పైనా ఆధారపడి లేదన్నారు. తనను లక్ష్యంగా చేసుకోవడానికి ప్రయత్నిస్తే తీవ్ర ప్రతిస్పందన ఉంటుందని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ఇరాన్‌ను హెచ్చరించిన నేపథ్యంలో ఈ ప్రకటన వచ్చింది. ఇదిలాఉంటే, ఫిబ్రవరి 28 నాటి అమెరికా – ఇజ్రాయెల్ సంయుక్త దాడుల్లో ఆయతుల్లా అలీ ఖమేనీ మృతి



చెందగా.. జులై 9న ఆయన అంత్యక్రియలు పూర్తయ్యాయి. అయితే, ఆ దాడిలో తీవ్రంగా గాయపడిన మొజ్తబా మాత్రం.. తండ్రి అంత్యక్రియల కార్యక్రమానికి హాజరుకాలేదు.

## బోటు బోల్తా ఘటన..

### భారత ఎంబసీ అధికారులతో మాట్లాడిన మంత్రి లోకేశ్



**అమరావతి:** వియత్నాంలో పర్యాటక బోటు బోల్తా పడిన ఘటనలో ఏపీ వాసులు మృతి చెందిన నేపథ్యంలో మంత్రి నారా లోకేశ్ స్పందించారు. వియత్నాంలోని భారత ఎంబసీ అధికారులతో మాట్లాడారు. భాధితులకు తక్షణ సాయం అందేలా చూడాలని కోరారు. ప్రమాదంలో చిక్కుకున్న తెలుగువారికి అన్ని విధాలా సహాయ సహకారాలు అందిస్తామని హామీ ఇచ్చారు. బాధితులకు ప్రభుత్వం పూర్తి అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. మరోవైపు దిల్లీలోని ఏపీ భవన్ అధికారులతోనూ మంత్రి నారా లోకేశ్ మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వ అధికారులతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. వియత్నాంలోని భారత ఎంబసీతో మాట్లాడుతున్నట్లు అధికారులు తెలిపారు. కేంద్ర ప్రభుత్వ సమన్వయంతో బాధితులకు సాయం అందించాలని లోకేశ్ సూచించారు. బాధితుల సమాచారం కోసం అక్కడి ప్రభుత్వం కంట్రోల్ రూమ్‌లను ఏర్పాటు చేసింది. 084 362817930, 084 915523714, 084 334520414, 084 913089165 నంబర్లలో సంప్రదించాలని కోరింది. పడవ ప్రమాద ఘటనలో మొత్తం 15 మంది మృతి చెందగా.. 21 మంది అస్వస్థతకు గురయ్యారు. వియత్నాంలోని ఫూ క్వాక్ ద్వీపం సమీపంలో ఈ ఘటన చోటు చేసుకుంది. ఓ మొబైల్ కంపెనీ భారత్‌కు చెందిన డిస్ట్రిబ్యూటర్ల కుటుంబాలను వియత్నాం పర్యటనకు తీసుకెళ్లింది. మొత్తం 250 మందిని తీసుకెళ్లగా.. అందులో ఏపీకి చెందిన 35 మంది, తెలంగాణకు చెందిన 40 మంది ఉన్నారు.

## టెకీ రాధా గాయత్రి భర్త శ్రీచరణ్ అరెస్ట్

**విశాఖపట్నం:** విశాఖకు చెందిన టెకీ రాధాగాయత్రి అనుమానాస్పద మృతి కేసులో కీలక పరిణామం చోటుచేసుకుంది. రాధా గాయత్రి భర్త శ్రీచరణ్‌ను దేహ్రాదూన్ పోలీసులు అరెస్ట్ చేశారు. డిప్యూటీ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ జేసీ పంత్ ఆధ్వర్యంలో విచారణ కొనసాగుతోంది. విజయనగరం జిల్లాకు చెందిన రాధాగాయత్రి అనుమానాస్పద మృతి కేసులో ఆమె తల్లిదండ్రులు సుధాకర్, సత్యవతి ఉత్తరాఖండ్‌లోని దేహ్రాదూన్‌లో న్యాయ–పోరాటం చేస్తున్నారు. రాధాగాయత్రిని భర్త శ్రీచరణ్ హత్య చేశాడని ఆమె తండ్రి సుధాకర్ ఆరోపిస్తున్నారు. ఈ ఘటనపై మెజిస్టీరియల్ దర్యాప్తు చేయాలని ఇప్పటికే దేహ్రాదూన్ జిల్లా కలెక్టర్ ఆదేశించారు. ఆయన ఆదేశాల మే–రకు మసూరీ డివిజనల్ మెజిస్ట్రేట్ రాహుల్ ఆనంద్ కేసు విచారణ ప్రారంభించారు. జూన్ 14–16 మధ్య మసూరీలో ఏం జరిగిందో అధికారుల దర్యాప్తులో తేలనుంది. తల్లిదండ్రులు రాకుండానే శవపరీక్ష చేసిన సిబ్బందిని ప్రశ్నించే అవకాశం ఉంది.

## 'హిట్..రన్ అండ్ ఎస్కేప్'.. ఇదే జగన్ నైజం : సీఎం చంద్రబాబు



**అమరావతి:** 'హిట్, రన్ అండ్ ఎస్కేప్ అనేది గొడ్డలి పార్టీ అధినేత నైజం' అని సీఎం చంద్రబాబు విమర్శించారు. నేరపూరిత మనస్తత్వం ఉండేవారు సోషల్ మీడియాను వేదికగా చేసుకుంటున్నారని, ప్రభుత్వాన్ని, నేతలను లక్ష్యంగా చేసుకొని విషప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. శనివారం చంద్రబాబు మీడియాతో చిట్‌చాట్‌గా మాట్లాడారు. ఇక్కడ సంఘటనలు చేయించి.. జగన్ బెంగళూరు వెళ్లి దాక్కుంటున్నారని ఎద్దేవా చేశారు. " ఏదో ఒక అరాచకానికి.. తెదేపా నేతలను బాధ్యుల్ని చేయాలని చూస్తున్నారు. ఈ సైకోయిజానికి.. ఆధ్యాత్మికత, టెక్నాలజీ పరిష్కారం చూపిస్తాయి. ఇలాంటి సైకో మనస్తత్వమే ఇవాళ తెలంగాణలో ఆరుగురి హత్యకు దారితీసింది. పోక్సో కేసు పెట్టారని.. కేసు పెట్టిన వారిని చంపేశాడు. తనకు సహకరించలేదని సొంత కుటుంబ సభ్యుల్నీ చంపేశాడు. గొడ్డలి పార్టీ అధినేతకూ, ఈ హంతకుడి మనస్తత్వానికి దగ్గర పోలికలు ఉన్నాయి. ఇద్దరి మనస్తత్వాలు ఇంచుమించు ఒక్కటే. కన్న తల్లి, సొంత చెల్లి, బాబాయ్ వ్యవహారాలు చూశాం. జగన్ నమ్ముకుంది గొడ్డలి, సోషల్ మీడియా ద్వారా విష ప్రచారమే. ప్రజలకు సాంకేతికతతో పాటు ఆధ్యాత్మికత ఎంతో అవసరం. అప్పుడే ఏది నిజమో తెలుసుకొని.. మంచి, చెడులు బేరీజు వేసుకోగలరు. గొడ్డలి పార్టీ అధినేత కుటుంబ చరిత్ర మొత్తం నేర స్వభావమే. తాత ముత్తాతల నుంచి ఇదే వైఖరి కొనసాగుతోంది. ఆ పార్టీ నేతల చరిత్ర కూడా అలాగే తయారవుతోంది. జగన్ ఎన్ని కుట్రలు పన్నినా భోగాపురం విమానాశ్రయం పూర్తయిపోయింది. అమరావతి, పోలవరం, వెలిగొండ పూర్తవుతున్నాయి. జగన్ .. రాష్ట్రానికి పరిశ్రమలు రాకుండా చేసేందుకు ప్రయత్నిస్తున్నారు. మావిగన్ పేరుతో పారిశ్రామిక వేత్తలను గందరగోళానికి గురి చేయాలనుకుంటున్నారు. బ్రాహ్మణి స్టీల్స్ దోపిడీ కథ ఇంతటితో ఆగలేదు. బ్రాహ్మణి స్థలం సమస్యకే ప్రస్తుతానికి ఇన్నేళ్లకు చెక్ పడింది. ఆ పరిశ్రమ వల్ల ఓబుళాపురం మైనింగ్ బ్లాక్ అయ్యింది. అలా జరగకుండా ఉంటే.. రాష్ట్రానికి భారీ పెట్టుబడులు వచ్చేవి. 4 సిమెంట్ ఫ్యాక్టరీలు, పరిశ్రమలు వచ్చేవి. పెండింగ్‌లో ఉన్న లేపాక్షి భూముల సమస్యకు కూడా త్వరలోనే పరిష్కారం చూపిస్తాం. లక్షల కోట్ల రాష్ట్ర సంపద దోపిడీ కోసం.. అభివృద్ధికి అడ్డుకట్టవేశారు. రాష్ట్రానికి పెట్టుబడులు రావడం గొడ్డలి పార్టీ అధినేతకు ఇష్టం లేదు. కేవలం నాకు పేరు వస్తుందనే అక్కసుతో ప్రతిదీ అడ్డుకోవాలని చూస్తున్నారు" అని చంద్రబాబు అన్నారు.

## ఇకపై వాట్సప్ ఫార్వర్డ్, స్క్రీన్‌షాట్ టికెట్స్ చెల్లవు: రైల్వే శాఖ



రైలు ప్రయాణం సమయంలో టికెట్లను టీటీఈలు తనిఖీ చేయడంపై భారతీయ రైల్వే శాఖ కీలక ప్రకటన చేసింది. వాట్సప్ ఫార్వర్డ్ లేదా స్క్రీన్ షాట్ తీసిన టికెట్లు ఇకపై చెల్లబోవని స్పష్టం చేసింది. ఒరిజినల్ టికెట్లనే అనుమతిస్తామని పేర్కొంది. టికెట్ దుర్వినియోగాన్ని నిరోధించేందుకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు వెల్లడించింది. రైల్వే టికెట్ వెరిఫికేషన్ సమయంలో వాట్సప్‌లో షేర్ చేసిన లేదా స్క్రీన్‌షాట్ టికెట్‌లను టీటీఈలు అనుమతించబోరని రైల్వే శాఖ పేర్కొంది. వీటిని ఎడిట్ లేదా ట్యాంపరింగ్ చేసే ప్రమాదం ఉందని, ఒకే టికెట్‌ను పలువురికి ఫార్వర్డ్ చేసే అవకాశం ఉందని తెలిపింది. వీటిని అరికట్టడంలో భాగంగా ఇకపై రైల్వే బుకింగ్ ప్లాట్‌ఫాం ద్వారా కొనుగోలు చేసే ఇ-టికెట్‌లు లేదా చెల్లుబాటు అయ్యే ప్రింటెడ్ టికెట్లనే అనుమతిస్తామని స్పష్టం చేసింది. ప్రయాణికులు కేవలం వాట్సప్ స్క్రీన్‌షాట్స్ లేదా ఫార్వర్డ్ మెసేజ్‌లను చూపిస్తే.. వారిని టికెట్ లేని ప్రయాణికులుగా పరిగణిస్తారు. ఆ సమయంలో ఆ ప్రయాణికులు కొత్త టికెట్ కొనాల్సి ఉంటుంది. జరిమానాతో పాటు రైల్వే నిబంధనల ప్రకారం చట్టపరమైన చర్యలు ఎదుర్కొవాల్సి ఉంటుంది. ఐఆర్‌సీటీసీ కనెక్ట్ యాప్‌లో బుక్ చేసిన ఇ-టికెట్ ఉండాలి. టికెట్ బుకింగ్ సమయంలో మొబైల్‌కు వచ్చే కన్ఫర్మేషన్ మెసేజ్. ఒరిజినల్ ఇ-టికెట్ ప్రింటెడ్ కాపీ (అవసరమైతే) తీసుకోవాలి. టికెట్‌తో పాటు ఆధార్ కార్డ్, పాన్ కార్డ్ వంటి ప్రభుత్వ గుర్తింపు కార్డులు వెంట తీసుకెళ్లాలి.






## ఈపీఎఫ్ ఖాతాల్లో వడ్డీ చెక్ చేసుకోండిలా..

గత ఆర్థిక సంవత్సరానికి గానూ చందాదారులకు ఉద్యోగుల భవిష్యనిధి సంస్థ వార్షిక వడ్డీని జమ చేస్తోంది. ఇప్పటికే దాదాపు 80శాతం ఖాతాల్లో వడ్డీ జమ అయినట్లు ఈపీఎఫ్ఓ వెల్లడించింది. జులై 15 నాటికి చందాదారులందరికీ ఈ మొత్తాన్ని అందజేయనున్నట్లు తెలిపింది. మరి మీ ఖాతాల్లో ఎంత మొత్తం వడ్డీ జమ అయిందో తెలుసుకోవాలను కుంటున్నారా..? పీఎఫ్ బ్యాలెన్స్‌ను తెలుసుకోవాలంటే మీ యునివర్సల్ అకౌంట్ నంబరు (యూఏఎన్) యాక్టివేట్‌లో ఉండాలి. ఈపీఎఫ్ఓ మెంబర్ పోర్టల్‌తో పాటు ఉమాంగ్ యాప్‌లోనూ చూసుకోవచ్చు. లేదంటే ఎస్ఎంఎస్ సర్వీస్ నుంచి కూడా తెలుసుకోవచ్చు.

### 1. ఈపీఎఫ్ఓ మెంబర్ పోర్టల్

ఈ పోర్టల్‌ను తెరిచి యూఏఎన్, పాస్‌వర్డ్‌తో పాటు క్యాప్చా ఎంటర్ చేసి లాగిన్ అవ్వాలి. ఆధార్‌తో లింక్ అయిన మీ మొబైల్ నంబరుకు ఓటీపీ వస్తుంది. దాన్ని ఎంటర్ చేయాలి. వెబ్‌పేజీలో View Passbook ఆప్షన్ మీద క్లిక్ చేస్తే ఈపీఎఫ్ బ్యాలెన్స్ కన్పిస్తుంది. అందులోని లావాదేవీల వరుసల్లో జమ అయిన వడ్డీ మొత్తాన్ని చూసుకోవచ్చు.

### 2. ఉమాంగ్ యాప్

ఉమాంగ్ యాప్‌లో లాగిన్ అయి మీ యూఏఎన్ నంబరును అనుసంధానించాలి. ఒకసారి లింక్ అయిన తర్వాత ఎప్పుడు కావాలంటే అప్పుడు పీఎఫ్ బ్యాలెన్స్, క్లెయిమ్‌ల వంటి సేవలను ఈ యాప్‌లో పొందొచ్చు. యాప్‌లో పీఎఫ్ బ్యాలెన్స్ ఆప్షన్ మీద క్లిక్ చేయగానే.. మూడు నెలల లావాదేవీలు కన్పిస్తాయి. అందులో వడ్డీ మొత్తం ఎంత ఉందో చూసుకోవచ్చు. పూర్తి లావాదేవీల కోసం పీడీఎఫ్‌ను డౌన్‌లోడ్ చేసుకోవచ్చు.

మీ పీఎఫ్ ఖాతాకు అనుసంధానమై ఉన్న మొబైల్ నంబరు నుంచి 7738299899 నంబరుకు మెసేజ్ చేయాలి. 'EPFOHO UAN' అని టైప్ చేసి దాని పక్కనే మీ యూఏఎన్ నంబరును జోడించి మెసేజ్ పంపిస్తే.. చివరిగా మీ ఖాతాలో జమ అయిన మొత్తం, ప్రస్తుత బ్యాలెన్స్ వంటి వివరాలను ఈపీఎఫ్ఓ అందిస్తుంది. మొత్తం 10 భాషాల్లో ఈ వివరాలను మీరు తెలుసుకోవచ్చు. తెలుగు కోసం.. మీరు పంపించే మెసేజ్ చివర TEL అని టైప్ చేయాల్సి ఉంటుంది. అయితే, ప్రస్తుతం వడ్డీ జమ ప్రక్రియ కొనసాగుతున్నందున చందాదారులకు వెంటనే ఆ మొత్తం పాస్‌బుక్‌లో కన్పించకపోవచ్చు. అందువల్ల కంగారు పడాల్సిందేమీ లేదని ఈపీఎఫ్ఓ చెబుతోంది. కచ్చితంగా ఖాతాలో వడ్డీ జమ అవుతుందని, కొన్ని రోజులు ఎదురుచూసి అప్‌డేట్ బ్యాలెన్స్ తెలుసుకోవచ్చని వెల్లడించింది.



## ఇంగ్లాండ్‌తో టెస్టు.. 269 పరుగుల ఆధిక్యంలో భారత్

**లార్డ్స్:** ఇంగ్లాండ్‌తో జరుగుతున్న ఏకైక టెస్టులో రెండో ఇన్నింగ్స్‌లో భారత మహిళల జట్టు 269 పరుగుల ఆధిక్యంలో కొనసాగుతోంది. రెండో రోజు ఆట ముగిసే సమయానికి ఒక వికెట్ నష్టానికి 154 పరుగులు చేసింది. స్మృతి మంధాన (69బి; 124 బంతుల్లో 9 ఫోర్లు 1 సిక్స్), యస్తికా భాటియా (39; 73 బంతుల్లో 4 ఫోర్లు) క్రీజ్‌లో ఉన్నారు. షెఫాలీ వర్మ (33)ను సోఫీ పెవిలియన్‌కు పంపించింది. 21/1తో రెండో రోజు ఆటను మొదలుపెట్టిన ఇంగ్లాండ్.. 170 పరుగులకు ఆలౌటైంది. ఇంగ్లాండ్ బ్యాటర్లలో అమీ జోన్స్ (52), నాట్ సీవర్ బ్రంట్ (44) రాణించారు. ఓపెనర్ మైయా బౌచియర్ (23) పరుగులు చేసింది. భారత బౌలర్లలో క్రాంతి గౌడ్ (5/37) సత్తాచాటింది. సయాలి సత్ఘరే 2, స్నేహ్ రాణా 2, దీప్తి శర్మ ఒక వికెట్ పడగొట్టారు. తొలి ఇన్నింగ్స్‌లో భారత్ 285 రన్స్‌కు ఆలౌటైంది.

# నేడే టీజీ20 ఫైనల్ ధమాకా

## ఖమ్మం ఏసెస్‌తో హైదరాబాద్ ఈ ఛాంపియన్స్ ఢీ



**హైదరాబాద్:** టీజీ20 లీగ్ దశలో ఏడుకు ఏడు విజయాలతో మిగతా జట్లకు అందనంత ఎత్తులో నిలిచింది హైదరాబాద్ ఈ ఛాంపియన్స్. అలాంటి జట్టును క్వాలిఫయర్-1లో ఓడించి అందరినీ ఆశ్చర్యపరిచింది ఖమ్మం ఏసెస్. అయితే తొలి క్వాలిఫయర్‌లో అనూహ్యంగా ఓడినప్పటికీ.. కరీంనగర్ డైమండ్స్‌తో రెండో క్వాలిఫయర్‌లో చెలరేగి ఆడిన హైదరాబాద్ అలవోకగా ఫైనల్ చేరింది. లీగ్ దశలో టాప్-2లో నిలిచిన జట్ల మధ్యే ఫైనల్ జరగనుండడంతో హోరాహోరీ తప్పదనే అంచనా. ఈ ఛాంపియన్స్ ఇటు బ్యాటింగ్, అటు బౌలింగ్‌లో ఎంతో బలంగా కనిపిస్తోంది. టోర్నీలో అత్యధిక పరుగులు సాధించిన బ్యాటర్, అత్యధిక వికెట్లు తీసిన బౌలర్ ఆ జట్టు ఆటగాళ్లే కావడం విశేషం. కెప్టెన్ అభిరథ్ రెడ్డి ఈ సీజన్లో 500 పరుగుల మార్కును అందుకున్న తొలి బ్యాటర్‌గా నిలిచాడు. అజయ్ దేవ్ గౌడ్ 19 వికెట్లతో పర్పుల్ క్యాప్‌తో సాగుతున్నాడు. బ్యాటింగ్‌లో అభిరథ్‌కు తోడు మరో ఓపెనర్ సాయివికాస్ కూడా ఫామ్‌లో ఉన్నాడు. పవర్‌ప్లేలో ఈ ఇద్దరూ చెలరేగారంటే హైదరాబాద్‌కు తిరుగుండదు. గణేశ్ గడుగు మ్యాచ్ స్థితికి అనుగుణంగా హిట్టింగ్ చేస్తున్నాడు. వైష్ణవ్ రెడ్డి వచ్చిన అవకాశాల్ని అందిపుచ్చుకుంటూ మ్యాచ్ విన్నర్‌గా నిలుస్తున్నాడు. బ్యాటింగ్‌లో ఈ నలుగురే కీలకం. అయితే ప్రధాన బ్యాటర్లు విఫలమైతే మిడిలార్డర్ ఎలా ఆడుతుందన్నది ప్రశ్న. క్వాలిఫయర్-1లో హైదరాబాద్ ఓడిపోవడానికి మిడిల్ వైఫల్యమే కారణం. బౌలింగ్‌లో హైదరాబాద్‌కు పెద్దగా సమస్యలు లేవు. కొత్త బంతితో అజయ్ మరోసారి జట్టుకు శుభారంభాన్నందిస్తాడని జట్టు ఆశిస్తోంది. మిగతా ఇద్దరు పేసర్లు అఖిల్ రాథోడ్, దేవ్ మెహతా పర్వాలేదనిపిస్తున్నారు. స్పిన్నర్లు ప్రణవ్ వర్మ, షణ్ముఖ అశ్విన్ పరుగులు కట్టడి చేయడంతో పాటు కీలక సమయాల్లో వికెట్లు తీస్తుండటం జట్టుకు కలిసొస్తోంది. ఫైనల్లోనూ సమష్టి ప్రదర్శనతో టైటిల్ ఎగరేసుకుపోవాలని హైదరాబాద్ ఉత్సాహంగా ఉంది. ఫైనల్‌కు ముందు సాయంత్రం 5:30 నుంచి టోర్నీ ముగింపు వేడుకలు జరగనున్నాయి. తెలంగాణ గవర్నర్ శివప్రతాప్ శుక్లా.. టీజీ20 బ్రాండ్ అంబాసిడర్, సినీ నటుడు విజయ్ దేవరకొండ ఈ వేడుకలకు హాజరు కానున్నారు. గాయకుడు రాహుల్ సిప్లిగంజ్ తన బృందంతో ప్రదర్శన ఇవ్వనున్నాడు.



# ఐదో టీ20లోనూ భారత్ ఓటమి

## ఇంగ్లాండ్ చేతిలో భారత్ వైట్ వాష్

**సౌథాంప్టన్:** టీ20ల్లో వరుసగా రెండుసార్లు ఛాంపియన్‌గా నిలిచిన టీమ్‌ఇండియాకు మరో షాక్. ప్రపంచ కప్ తర్వాత భారత జట్టు వరుసగా రెండో సిరీస్‌లో వైట్ వాష్‌ను ఎదుర్కొంది. మొన్న ఐర్లాండ్ చేతిలో కంగుతిన్న టీమ్‌ఇండియా.. ఇప్పుడు ఇంగ్లాండ్ గడ్డపై కూడా పేలవ ప్రదర్శన చేసి ఒక్క మ్యాచ్‌లోనూ విజయం సాధించకుండా సిరీస్‌ను చేజార్చుకుంది. శనివారం జరిగిన ఐదో టీ20లో భారత్‌పై ఇంగ్లాండ్ 56 పరుగుల తేడాతో విజయం సాధించింది. దీంతో ఐదు మ్యాచ్‌ల సిరీస్‌ను ఆతిథ్య జట్టు 4-0తో కైవసం చేసుకుంది. తొలుత బ్యాటింగ్ చేసిన ఇంగ్లాండ్ 3 వికెట్ల నష్టానికి 257 పరుగులు చేసింది. కొండంత లక్ష్యఛేదనలో భారత జట్టు 201/8 స్కోరుకు పరిమితమైంది. ఇషాన్ కిషన్ (56; 35 బంతుల్లో 7 ఫోర్లు, 2 సిక్స్‌లు), తిలక్ వర్మ (53; 25 బంతుల్లో 3 ఫోర్లు, 4 సిక్స్‌లు) అర్ధ శతకాలు చేశారు. మిగతా బ్యాటర్లు నిరాశపర్చారు. సంజు శాంసన్ (27), శ్రేయస్ అయ్యర్ (28), శివమ్ దూబె (14) పరుగులు చేశారు. అభిషేక్ శర్మ (3) సింగిల్ డిజిట్‌కే వెనుదిరిగాడు. ఇంగ్లాండ్ బౌలర్లలో సామ్ కరన్ 3, ఆదిల్ రషీద్ 2, జోఫ్రా ఆర్చర్, జోష్ టంగ్, లియామ్ డాసన్ ఒక్కో వికెట్ పడగొట్టారు. తొలుత ఇంగ్లాండ్ బ్యాటర్లలో జోస్ బట్లర్ (131; 64 బంతుల్లో 12 ఫోర్లు, 8 సిక్స్‌లు) 'శత'క్కొట్టాడు. హ్యారీ బ్రూక్ (95బి; 45 బంతుల్లో 4 ఫోర్లు, 8 సిక్స్‌లు) త్రుటిలో సెంచరీ మిస్ చేసుకున్నాడు.









## ఓపెన్‌ఏఐపై యాపిల్ దావా

గోప్యత విషయంలో టెక్‌సంస్థలు యాపిల్ - ఓపెన్ ఏఐ మధ్య నెలకొన్న పోటీ తాజాగా తీవ్రరూపం దాల్చింది. ఈ నేపథ్యంలో ఓపెన్ ఏఐపై యాపిల్ దావా వేసింది. ఈ ఏఐ సంస్థ తమ వాణిజ్య రహస్యాలను దొంగిలించిందని తన దావాలో ఆరోపించింది. ఓపెన్ ఏఐతో సహా యాపిల్‌లో పనిచేసిన ఇద్దరు మాజీ ఉద్యోగులపైనా చట్టపరమైన చర్యలకు దిగింది. డిజైన్, తయారీ ప్రక్రియ, సరఫరా గొలుసు వ్యూహాలతో సహా యాపిల్‌కు సంబంధించిన గోప్యమైన సమాచారాన్ని తెలుసుకునేందుకు వీరంతా కలిసి పనిచేశారని ఆరోపించింది. తమ సంస్థ నుంచి వెళ్లిపోయేటప్పుడు ఆ ఉద్యోగులు కంపెనీ ల్యాప్‌టాప్‌లను తిరిగి ఇవ్వలేదని యాపిల్ పేర్కొంది. ఆ తర్వాత అందులోని ఓ బగ్ సాయంతో తమ ఇంటర్నల్ నెట్‌వర్క్‌లోకి చొరబడి సున్నితమైన రహస్యాలను తెలుసుకున్నారని తెలిపింది. ప్రస్తుతం ఓపెన్‌ఏఐకి హార్డ్‌వేర్ చీఫ్‌గా ఉన్న టాన్.. గతంలో యాపిల్‌లో పనిచేశారు. ఆయన యాపిల్ నుంచి వెళ్లపోవడానికి ముందు సప్లయిర్ల సమాచారం, సంస్థకు సంబంధించిన అంతర్గత వివరాలను తన ఈమెయిల్‌కు పంపించుకున్నారు. ఏఐ సంస్థకు ప్రయోజనం చేకూర్చేందుకు రహస్య సమాచారాన్ని పద్ధతి ప్రకారం ఉపయోగించుకున్నారని దావాలో యాపిల్ ఆరోపించింది. ఓపెన్‌ఏఐలో జరిగే ఇంటర్వ్యూల్లో 'షో అండ్ టెల్' సెషన్‌ల కోసం అప్పటి యాపిల్ ఉద్యోగులను విడిభాగాలను తీసుకురావాలని టాన్ ప్రోత్సహించినట్లు పేర్కొంది. ప్రస్తుతం 400 మంది మాజీ ఉద్యోగులు ఓపెన్‌ఏఐలో పనిచేస్తున్నారని వెల్లడించింది. తమ వద్ద హార్డ్‌వేర్ రంగంలోని వాణిజ్య రహస్యాలకు సంబంధించిన విభాగాల్లో పనిచేసిన ఉద్యోగులు.. ఇప్పుడు ఆ వివరాలను ఓపెన్‌ఏఐలో ఉపయోగించుకోవడానికి హక్కు ఉండదని పేర్కొంది. ప్రస్తుతం ఓపెన్‌ఏఐ హార్డ్‌వేర్ రంగంలోకి వేగంగా అడుగులు వేస్తోంది. దానిలో భాగంగా హార్డ్‌వేర్ స్టార్టప్ ఐఓ ప్రొడక్ట్స్‌ను సొంతం చేసుకునేందుకు 6.5 బిలియన్ డాలర్లను వెచ్చించింది. దానిని యాపిల్ డిజైనర్ జానీ ఐవ్ స్థాపించారు. అయితే అతడి పేరును యాపిల్ దావాలో చేర్చలేదు. ఏఐ ఉత్పత్తుల అభివృద్ధి విషయంలో నెలకొన్న పోటీతో రెండు సంస్థల మధ్య సంబంధాలు దెబ్బతిన్నాయి. తమ గోప్య సమాచారం ఏఐకి చేరుతుందనే ఆందోళన నేపథ్యంలో చర్చిద్దామని అడిగామని, కానీ ఓపెన్ ఏఐ నుంచి ఎలాంటి సమాధానం రాలేదని యాపిల్ తన ఫిర్యాదులో పేర్కొంది.



## భాగ్యశ్రీ బోర్సే ..భావోద్వేగం

'లెనిన్'లో అఖిల్‌కు జోడీగా భారతి పాత్రలో నటించి ఆకట్టుకున్నారు నటి భాగ్యశ్రీ బోర్సే. ఈ సినిమా కోసం టీమ్ ఎంతో కష్టపడిందని ఆమె తెలిపారు. తాజాగా ఈ చిత్రం సక్సెస్‌మీట్‌లో భాగ్యశ్రీ మాట్లాడుతూ.. తన అభిమానులు తనను నిరంతరం ప్రోత్సహిస్తూనే ఉన్నారని ఈ చిత్రబృందంతో పాటు వాళ్లందరి వల్లే తాను ఈ స్థాయిలో ఉన్నానని ఒకింత భావోద్వేగానికి గురయ్యారు. హైదరాబాద్ తనకు కర్మభూమి అని చెప్పారు.

# అఖిల్‌కు హిట్ ఇమ్మని శ్రీవారిని కోరుకున్నా

### లెనిన్ సక్సెస్ మీట్‌లో నాగార్జున



తిరుమల శ్రీవారి దర్శనానికి ఎప్పుడెళ్లినా తాను ఏం కోరుకోనని.. కానీ, ఇటీవల వెళ్లినప్పుడు మాత్రం అఖిల్‌కు మంచి హిట్ ఇవ్వమని కోరుకున్నట్లు నాగార్జున తెలిపారు. అఖిల్ హీరోగా మురళీ కిషోర్ అబ్బూరి తెరకెక్కించిన 'లెనిన్' తాజాగా ప్రేక్షకుల ముందుకు వచ్చి పాజిటివ్ టాక్‌ను సొంతం చేసుకుంది. ఈ నేపథ్యంలో చిత్రబృందం నిర్వహించిన సక్సెస్ మీట్‌లో నాగార్జున మాట్లాడుతూ.. అఖిల్‌కు విజయాన్ని ఇవ్వాలనే ఏకైక లక్ష్యంతో టీమ్ అంతా కలిసి కట్టుగా వర్క్ చేసిందన్నారు. సినిమాకు అడగ్గానే వాయిస్ ఓవర్ ఇచ్చిన మా పెద్దబ్బాయ్ తారక్‌కు ధన్యవాదాలు. సరిగ్గా ఏడాది క్రితం 'తండేల్' సక్సెస్‌మీట్‌కు వచ్చాను. ఇప్పుడు 'లెనిన్' ఈవెంట్.. నాగచైతన్య, అఖిల్ ఇద్దరూ నాకు రెండు కళ్లు. 'లెనిన్' దర్శకుడు మురళీ కిషోర్, ఎడిటర్ నవీన్ ఇద్దరూ పనిరాక్షసులు. భాగ్యశ్రీ సినిమాకు ప్రత్యేక ఆకర్షణ. ఈ చిత్రాన్ని అంగీకరించినందుకు ఆ అమ్మాయికి థాంక్స్ చెప్పాలి. సినిమా విడుదలకు ముందు రోజు రాత్రి భాగ్యశ్రీ ఫోన్ చేసి టెన్షన్ పడింది. తాను ఎంతో కష్టపడుతున్నాననీ కానీ, సరైన గుర్తింపు రావట్లేదని బాధపడింది. 'కష్టానికి తగిన ప్రతిఫలం కచ్చితంగా వస్తుందని చెప్పా. అదే నిజమైంది. ఈ సినిమా విజయంలో నాగవంశీ ముఖ్యపాత్ర పోషించారని టీమ్‌కు థాంక్స్ చెప్పారు. ఇక అఖిల్ గురించి మాట్లాడుతూ.. ఏది అనుకున్నా దాన్ని కచ్చితంగా సాధించాలనే తపన చిన్నప్పటి నుంచి ఉంది. ఎంతో ఎనర్జిటిక్‌గా ఉంటాడు. ఇప్పటి వరకూ ప్రతి సినిమాకు వందశాతం న్యాయం చేశాడు. కానీ, హిట్ కొట్టలేకపోయాడు. 'లెనిన్'తో సరైన హిట్ పడింది.




## ఓ సుకుమారి ట్రైలర్ విడుదల

'మసూద', 'పరేషాన్' చిత్రాలతో వైవిధ్యమైన నటుడిగా గుర్తింపు తెచ్చుకున్న తిరువీర్, టాలెంటెడ్ బ్యూటీ ఐశ్వర్య రాజేష్ ప్రధాన పాత్రల్లో నటించిన లేటెస్ట్ మూవీ 'ఓ సుకుమారి'. భరత్ దర్శన్ దర్శకత్వంలో తెరకెక్కిన ఈ ఫీల్ గుడ్ మ్యూజికల్ లవ్ అండ్ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్ అధికారిక ట్రైలర్ తాజాగా విడుదలైంది. ఒక అందమైన గ్రామీణ నేపథ్యంలో సాగే స్వచ్ఛమైన ప్రేమకథ, ఆ తర్వాత వారి జీవితాల్లో వచ్చే మలుపుల చుట్టూ ఈ సినిమా కథ తిరుగుతుందని ట్రైలర్ చూస్తే అర్థమవుతోంది. తిరువీర్ తన మార్క్ సహజ నటనతో ఆకట్టుకోగా, ఐశ్వర్య రాజేష్ మరోసారి నటన ప్రాధాన్యమున్న పాత్రలో మెరిశారు. భరత్ మంచిరాజు అందించిన స్వరాలు, నేపథ్య సంగీతం ఈ సినిమాకు ప్రధాన ఆకర్షణగా నిలవనున్నాయి. సున్నితమైన భావోద్వేగాలు, చక్కటి వినోదంతో కూడిన ఈ చిత్రం జూలై 17న ప్రేక్షకుల ముందుకు రానుంది.

# 24న రామాయణ ట్రైలర్ విడుదల




భారతీయ చిత్ర పరిశ్రమ చరిత్రలోనే భారీ స్థాయిలో తెరకెక్కుతున్న చిత్రం 'రామాయణ'. విడుదలకు ముందే ఈ సినిమాపై దేశవ్యాప్తంగా ఆసక్తి నెలకొంది. ఈ ఏడాది అత్యంత ఆసక్తిగా ఎదురుచూస్తున్న చిత్రాలలో ఇదీ ఒకటి. ఈ మూవీలో రాముడిగా బాలీవుడ్ నటుడు రణ్‌బీర్ కపూర్, సీతగా సాయి పల్లవి నటిస్తున్నారు. నితీశ్ తివారీ దర్శకత్వంలో తెరకెక్కుతోన్న ఈ చిత్రం రెండు భాగాలుగా విడుదల కానుంది. తాజాగా చిత్రబృందం ఈ సినిమా ట్రైలర్ విడుదల తేదీని ప్రకటించింది. జులై 24న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో ఈ సినిమా ట్రైలర్‌ను విడుదల చేయనున్నట్లు ఇన్‌స్టా వేదికగా వెల్లడించింది. కొన్ని వేల సంవత్సరాలుగా ధర్మం, మర్యాద, ధైర్యం, కరుణ అనే ఆదర్శాలతో 'రామాయణం' ఎన్నో తరాలకు స్ఫూర్తినిచ్చింది. మన నాగరికతకు అద్దం పట్టే ఈ గొప్ప ఇతిహాసాన్ని ప్రపంచానికి సరికొత్తగా పరిచయం చేయబోతున్నాం అని ఇన్‌స్టాలో చిత్రబృందం పోస్ట్ చేసింది. ఈ చిత్రంలో రణ్‌బీర్ కపూర్, సాయిపల్లవితో పాటు పలువురు అగ్ర తారలు కీలక పాత్రలు పోషిస్తున్నారు. భారీ బడ్జెట్‌తో ఈ సినిమా తీస్తున్నట్లు నిర్మాత నమిత్ మల్హోత్రా తెలిపారు.



# మరో ప్రేమ కథాచిత్రం హృదయ మురళి




తమిళ హీరో అథర్వ 'హృదయం మురళి' అనే అనువాద చిత్రంతో బాక్సాఫీస్ బరిలో నిలిచారు. మనసులోని ప్రేమను బయటకు చెప్పలేని హృదయ (అథర్వ) అనే కుర్రాడి కథ ఇది. చిన్నప్పుడే తల్లిదండ్రుల్ని కోల్పోయిన అతణ్ని మామయ్య (నట్టి సుబ్రహ్మణ్యం) అన్నీ తానై పెంచి పెద్ద చేస్తాడు. చిన్నప్పుడు స్కూల్లో తన ఇంగ్లీష్ టీచర్ గీత (జోనితా గాంధీ)పై పుట్టిన అమాయకపు క్రష్ నుంచి.. ట్యూషన్‌లో సమంత (ప్రీతి ముకుందన్).. కాలేజీ రోజుల్లో అముద (కయాదు).. ఇలా హృదయ జీవితంలో వివిధ దశల్లో పలు ప్రేమకథలుంటాయి. ప్రతి ఒక్కర్నీ గాఢంగా ప్రేమించినా.. మనసులోని ప్రేమను వ్యక్తపరచలేకపోతాడు. అయితే అదితి (మాళవిక మోహనన్)తో పెళ్లి పీటలెక్కడానికి పదిరోజుల సమయం ఉందనగా.. తన మనసులో దాగి ఉండిపోయిన ప్రేమని వ్యక్తపరిచేందుకు ఫ్రెండ్స్‌తో కలిసి న్యూయార్క్‌కి బయలుదేరుతాడు హృదయ. మరి ఆ తర్వాత ఏమైంది? సరిగ్గా పెళ్లికి ముందు తన గత ప్రేమ జ్ఞాపకాల్ని వెతుక్కుంటూ హృదయ ఎవరి దగ్గరకి వెళ్లాడు? ఈ ప్రయాణంలో తాను కోరుకున్నట్లుగా నిజమైన ప్రేమని దక్కించుకున్నాడా? సమంత, అముద, అదితిల్లో ఎవరితో కలిసి పెళ్లి పీటలెక్కాడు? అన్నది మిగిలిన కథ. వన్ సైడ్ లవ్‌స్టోరీస్ వెండితెరకు కొత్తేమీ కాదు. అయితే వీటిలో మనసులోని ప్రేమను బయట పెట్టలేక ఒంటరి ప్రేమికులుగా మిగిలిన ప్రేమకథలెప్పుడూ ప్రత్యేకమే. ఈ 'హృదయం మురళి' కూడా ఆ కోవకు చెందిన చిత్రమే. అయితే దీన్ని 90ల నాటి నోస్టాల్జియా మూమెంట్స్‌తో ముడిపెట్టి.. పాత జ్ఞాపకాల్ని గుర్తు చేస్తూ.. ఈతరం ప్రేక్షకులకూ కనెక్ట్ అయ్యేలా వినోదాత్మకంగా తీర్చిదిద్దిన తీరు ఆద్యంతం అలరిస్తుంది. మనసులోని ప్రేమను బయటకు చెప్పలేని ప్రేమికుడిగా హృదయ పాత్రలో అథర్వ ఒదిగిపోయాడు. ఆద్యంతం చక్కని నటనతో కట్టిపడేశాడు. ప్రీతి ముకుందన్ తెరపై అందంగా కనిపిస్తూనే.. చక్కటి అభినయాన్ని చూపించే అవకాశం దొరికింది. ఆమె పాత్రకి ఇచ్చిన ట్విస్ట్ ఆకట్టుకుంటుంది. అముదగా కయాదు కనిపించినంత సేపూ అలరిస్తుంది. తమన్, నిహారిక, ద్రవిడ్ తదితరుల పాత్రలు కథని ముందుకు తీసుకెళ్లడంలో తమ వంతు పాత్ర పోషించాయి. నేపథ్య సంగీతం సినిమాకి తగ్గట్లుగా కుదిరింది. విజువల్స్, నిర్మాణ విలువలు బాగున్నాయి.

## రామ్ సినిమాకు సంయుక్త మీనన్ గ్రీన్ సిగ్నల్

టాలీవుడ్ క్రేజీ బ్యూటీ సంయుక్త మీనన్ ప్రస్తుతం వరుస భారీ ప్రాజెక్టులతో ఫుల్ బిజీగా మారారు. బ్యాక్ టు బ్యాక్ షూటింగులలో పాల్గొంటూ బిజీ షెడ్యూల్స్ కారణంగా ఈ మధ్య కాలంలో ఆమె సోషల్ మీడియాకు కూడా కాస్త దూరం అయ్యారు. ప్రస్తుతం ఆమె బెంజ్, స్లమ్ డాగ్, స్వయంభూ వంటి భారీ చిత్రాలతో పాటు లేడీ ఓరియెంటెడ్ మూవీ 'బ్లాక్ గోల్డ్' వంటి విభిన్నమైన ప్రాజెక్ట్‌తో ఫుల్ ఫామ్‌లో దూసుకుపోతున్నారు. ఈ నేపథ్యంలో, తాజాగా, ఈ అమ్మడు ఖాతాలోకి మరో బంపర్ ఆఫర్ వచ్చి చేరినట్లు సమాచారం. ఉస్తాద్ రామ్ పోతినేని స్వయంగా దర్శకత్వం వహించబోతున్న చిత్రం 'రాపో-23' లో సంయుక్త మీనన్‌ను హీరోయిన్‌గా ఎంపిక చేసినట్లు టాక్ వినిపిస్తోంది. నిజానికి ఇన్నాళ్లూ ఈ పాత్ర కోసం నివేదా పేతురాజ్ పేరు పరిశీలనలోకి వచ్చినప్పటికీ, ఆమె డేట్స్ సర్దుబాటు కాకపోవడంతో మూవీ మేకర్స్ సంయుక్త వైపు మొగ్గు చూపినట్లు తెలుస్తోంది. ఇప్పటికే చిత్రబృందం ఆమెను సంప్రదించగా, కథ నచ్చడంతో సంయుక్త కూడా గ్రీన్ సిగ్నల్ ఇచ్చే ఆలోచనలో ఉన్నట్లు సమాచారం.

PUBLISHED AND OWNED BY **DUSARI KASTURI, PRINTER B SANDHYA RANI PRINTED AT M/S.KAKATIYA PRINTERS** 2-24-96/9, NEAR SRI KRISHNA PHARMA, LAXMINARAYANA NAGAR, IDA UPPAL, MEDCHAL MALKAJGIRI, TELANGANA - 500039, PUBLISHED AT H.NO. 9-875/104/3A, BAPUJI COLONY, NEAR VIJAYA HOSPITAL NAGARAM , MEDCHAL MALKAJ-GIRI, TELANGANA - 500083.,**EDITOR : DUSARI RAVINDER GOUD, PRGI REGISTRATION NUMBER TGTEL/25/A1132**, CELL :8522055889 MAIL ID:dusari kasturi9@gmail.com